ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు


బుధవారం 1 మే 2024

సూపర్ సిక్స్ పథకాలు

యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి, పాఠశాలకు వేళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల సాయం, రైతుకు ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20వేలు, ప్రతి మహిళకు నెలకు రూ. 1500 (19 ఏళ్ల నుంచి 59 వరకు), ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నారు.

ప్రజాగళం

ఉమ్మడి మేనిఫెస్టో - 2024




మేనిఫెస్టో.. అదుర్స్

అన్నివర్గాలకు మేళ్లు..

- పింఛన్ పెంపుతో పండుటాకులకు నిశ్చింత
- మహిళలకు పెద్దపీట
- యువతకు ఉద్యోగాలు
- కార్మికులకు భరోసా
- అన్నదాతకు అండ
- సర్వత్రా హర్షం
- కూటమి అభ్యర్థుల్లో నూతనోత్సాహం
- వైసీపీ డీలా

సూపర్ సిక్స్ పథకాలే సూపర్ అనుకుంటే.. టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టో అదుర్స్ అనిపించింది. అన్నివర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అందరూ స్వాగతిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం టీడీపీ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలో సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేకూర్చేలా, వారి తలసరి ఆదాయం పెంచడమే ధ్యేయంగా సంక్షేమ ఫలాల లబ్ధిని పెంచారని ఆనందిస్తున్నారు. కూటమి మేనిఫెస్టోలో టీడీపీ సూపర్ సిక్స్ హామీలతోపాటు 2.0 షణ్ముఖ వ్యూహం పథకాలతో రూపొందించారు. టీడీపీ కూటమి ఉమ్మడి మేనిఫెస్టో జనరంజకంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేనిఫెస్టో కూటమి అభ్యర్థులు, శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. వైసీపీ శ్రేణులు డీలా పడ్డాయి.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



పశుబీమా ప్రయోజనకరం

పాడి రైతులకు పశువులే జీవనాధారం. అటువంటి పశువులు ప్రమాదవశాత్తు మరణిస్తే తీవ్రంగా నష్టపోతాం. వాటికి బీమా సౌకర్యం కల్పించడం హర్షణీయం. ఇంటి వద్దకే గోపాలమిత్ర విధానాన్ని అమలు చేస్తే ఎంతో ప్రయోజనకంగా ఉంటుంది.

- స్వప్న, మహిళా రైతు, లేపాక్షి

రైతు సంక్షేమమే లక్ష్యం



రైతుకు ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం, వ్యవసాయ రంగానికి 9 గంటల పాటు ఉచిత విద్యుత్, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, రాయితీతో సోలార్ పంపుసెట్లు, మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు, 90 శాతం సబ్సిడీతో బిందు సేద్యం పరికరాల పంపిణీ, ప్రతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వెయ్యి ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయం, పట్టు రైతుకు ప్రోత్సాహకం, కౌలు రైతుకు గుర్తింపు కార్డులతోపాటు సంక్షేమ పథకాలు, పంటల బీమా వర్తింపు, పాడి రైతుకు పశువుల కొనుగోలు, దాణా, మందులపై సబ్సిడీ, బీమా, గోకులాల ఏర్పాటు, మేత కోసం బంజరు భూముల కేటాయింపు, పలు రాయితీలు ఇవ్వనున్నారు. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం వంటివి రైతు సంక్షేమమే లక్ష్యంగా రూపొందించారు.

సూపర్ సిక్స్.. షణ్ముఖ వ్యూహం

ఇంటింటికీ రక్షిత తాగునీరు, ఉచితంగా కొళాయి కనెక్షన్, పూర్ టూ రిచ్ కింద పేదలను సంపన్నులను చేసేదిశగా పబ్లిక్, ప్రైవేటు పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్ (పీ4) ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్య శిక్షణ, సౌభాగ్య పథకం కింద చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, అంకుర సంస్థలకు ప్రాజెక్టు వ్యయంలో గరిష్ఠంగా రూ.10లక్షల వరకు సబ్సిడీ, యవత సంక్షేమం కింద మెగా డీఎస్సీ, ఏటా జాబ్ క్యాలెండర్, క్రీడలు, డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుతోపాటు సంక్షేమ ప్రోత్సాహకాలు అందించనున్నారు.

బీసీలకు రాజకీయ ప్రాధాన్యజ

బీసీ వర్గాలకు డిక్లరేషన్‌తోపాటు రాజకీయ ప్రాధాన్యం కల్పించనున్నారు. బీసీలకు 50 ఏళ్లకే నెలకు రూ.4వేల పింఛన్, ప్రత్యేక రక్షణ చట్టం, సబ్‌ప్లాన్ కింద లక్షన్నర కోట్ల రూపాయల కేటాయింపులు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కోసం కేంద్రానికి తీర్మానం పంపడం, బీసీల ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాలు, పునరుద్ధరణలో దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధులు, స్వయం ఉపాధి కోసం రూ.10 వేల కోట్లు, ఆదరణ కోసం రూ.5వేల కోట్ల కేటాయింపు వంటి హామీలు ఇచ్చారు.

అన్నివర్గాలకు మేళ్లు

టీడీపీ మేనిఫెస్టోను అన్నివర్గాలకు మేలు చేకూర్చేలా రూపొందించారు. కాపు, ఆర్యవైశ్య, క్షత్రియ, అగ్రవర్ణ పేదలు, ముస్లిం, క్రిస్టియన్, వడ్డెర, గీత కార్మికులు, నాయీబ్రాహ్మణులు, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్, మత్స్యకారులు, రజకులు స్వర్ణకారులు, ఎస్సీ, ఎస్టీ, దేవాలయాలు, బ్రాహ్మణుల సంక్షేమానికి రాయితీలు, ప్రోత్సాహకాలు అందిచనున్నారు. మహిళా సంక్షేమం, విద్య, వైద్యం, ఉచిత ఇసుక విధానం, ఫీజు రీయింబర్స్‌మెంట్, పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణ, ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికుల సామాజిక భద్రత పింఛన్ల పెంపు, పేదలందరికీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు, ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. బాలికా విద్య కోసం కలలకు రెక్కలు పథకం అమలు చేయనున్నారు.

వడ్డీలేని రుణాలు.. హర్షదాయకం..

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు రూ.3 లక్షల నుంచి రూ.10లక్షలకు వర్తింపజేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడం హర్షదాయకం. విద్యార్థులకు కలలకు రెక్కలు పేరుతో రుణాలు అందించనున్నారు. పెన్షనర్లకు మంచి రోజులు రానున్నాయి. యాదవులు, కురుబలకు గొర్రెల పెంపక యూనిట్ల స్థాపనకు రాయితీ రుణాలు ఇవ్వనున్నారు. రూ.5వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరించనుండడం మంచి పరిణామం.

- తులసి, రొద్దం

యువతకు పెద్దపీట

మేనిఫెస్టోలో ఉద్యోగ కల్పనకు పెద్దపీట వేశారు. నేను డిగ్రీ చదువుకున్నా. ఐదేళ్ల నుంచి ఖాళీగా ఉన్నా. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు భృతి ఇవ్వనుండడం సంతోషదాయకం. ఉద్యోగాల కల్పనకు హామీ భవిష్యత్తుపై ఆశలు రేపుతోంది. చంద్రబాబుతోనే యువతకు న్యాయం చేకూరుతుంది.

- నరసింహమూర్తి, కోనాపురం, పెనుకొండ మండలం

అర్చకులను గుర్తించింది టీడీపీయే

ఆలయ అర్చకులను గత ప్రభుత్వాలు చిన్నచూపు చూశాయి. ధూపదీప నైవేద్యాలకు పూర్వీకులు కేటాయించిన భూములను సైతం అమ్ముకున్నాయి. ఆలయాల అభివృద్ధిని మరిచాయి. దీంతో అర్చకుల దయనీయ పరిస్థితిలో ఉన్నారు. టీడీపీ హయాంలో అర్చకులు, మౌలానా, మౌజాన్లు, చర్చి పాస్టర్లకు జీవనభృతి కల్పించారు. టీడీపీ అధికారంలకి వస్తేనే ఆలయాల అభివృద్ధితోపాటు అర్చకులకు జీతభత్యాలు అందుతాయి.

కన్నాస్వామి, ఐముక్తేశ్వరస్వామి ఆలయ అర్చకుడు, పెనుకొండ

అన్నివర్గాలకు పెద్దపీట

ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలు, ఐదేళ్లలో చేపట్టబోయే పథకాలు అన్నివర్గాలకు అనుకూలం. బీసీలకు ప్రత్యేక చట్టం వరం. రైతులకు ఎంతో ప్రయోజనకరం. రైతు దిశ, దశ మారుస్తుంది. మైనార్టీల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు అమలు చేయనున్న సంక్షేమ పథకాలు వారి జీవన స్థితిని మారుస్తాయి.

- కొల్లకుంట అంజినప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కరెంటు చార్జీలు పెంచకపోతే వరమే..

కూటమి మేనిఫెస్టోలో కరెంటు చార్జీలు పెంచమని చెప్పడం సంతోషకరం. ప్రస్తుతం ఇంటికే దాదాపు రూ.600 దాకా కరెంటు బిల్లు వస్తోంది. గతంలో రూ.200కి మించి వచ్చేది కాదు. కరెంటు బిల్లు చూస్తే భయమేస్తోంది. కరెంటు చార్జీలు పెంచమని చంద్రబాబు చెప్పడం పేదలకు నిజంగా వరమే.

- శ్రీనివాసులు, బత్తలపల్లి

అన్న క్యాంటీన్లు తెరుస్తామనడం సంతోషకరం

టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్ల ద్వారా వివిధ గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలకు రూ.5కే కడుపు నిండా భోజనం దొరికేది. వైసీపీ అధికారం చేపట్టాక వాటిని మూసి వేశారు. అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిస్తామని టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో పేర్కొనడం సంతోషదాయకం. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వస్తుంటాం. హోటల్‌లో భోజనం చేయాలంటే రూ.50 ఇవ్వాలి. అదే అన్న క్యాంటీన్‌లో రూ.5కే భోజనం చేయవచ్చు.

- జయప్రకాశ్, బుడ్డారెడ్డిపల్లి, ధర్మవరం మండలం

రూ.4వేలు పింఛన్‌తో నిశ్చింతగా బతికేస్తాం

ఇంటి వద్దకే వచ్చి నెలనెలా రూ.4వేలు పింఛన్ ఇస్తామని చంద్రబాబు చెబుతున్నారు. మాలాంటి వృద్ధులకు అంత కన్నా భాగ్యం ఏముంటుంది? ఏ చింతాలేకుండా బతికేస్తాం. చంద్రబాబు వస్తే చెప్పినట్లు రూ.4వేలు పింఛన్ ఇస్తాడన్న నమ్మకం ఉంది.

- వెంకటరమణమ్మ, వృద్ధురాలు, బసంపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

మహిళలకు ఎంతో లబ్ధి

ఉమ్మడి మేనిఫెస్టోతో మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. అన్నింటి ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఏడాదిలో ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం సంతోషించదగ్గ విషయం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం పేరుతో ఏడాదికి పిల్లల చదువుకు రూ.15వేల ఆర్థికసాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థికసాయం అందించడం హర్షణీయం.

- ఎం.రాధమ్మ, గుండుమల, మడకశిర మండలం



డ్రైవర్లకు చేయూతనిచ్చే మేనిఫెస్టో

ఉమ్మడి మేనిఫెస్టో ట్యాక్సీ డ్రైవర్లకు చేయూతనిచ్చేదిగా ఉంది. డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు మంచి నిర్ణయం. తద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ట్యాక్సీ డ్రైవర్లకు ఉపశమనం దక్కుతుంది. ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్సు, విద్యారుణాలు, వాహనకొనుగోలుకు వడ్డీ రాయితీతో కూడిన రుణాలతో డ్రైవర్ల స్థితిగతులు మారుతాయి. గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపు, జీఓ నంబర్ 21 రద్దును స్వాగతిస్తున్నాం.

- సాయిప్రసాద్, అధ్యక్షుడు, పర్తిసాయి డ్రైవర్స్ అసోసియేషన్, పుట్టపర్తి



ప్రత్యేక చట్టంతో బీసీలకు రక్షణ

బీసీలకు ప్రత్యేక చట్టాన్ని అమలు చేస్తామని మేనిఫెస్టోలో ఉంచడం సంతోషదాయకం. ఈ చట్టం బీసీలకు రక్షణ కవచం. ప్రస్తుతం బీసీలపై ఎక్కడ చూసినా దాడులు జరుగుతున్నాయి. ప్రత్యేక చట్టం అమలు చేస్తే బీసీలపై దాడులు చేయాలంటేనే ఆలోచించాల్సి వస్తుంది.

- నరసింహులు, కేశాపురం, కొత్తచెరువు మండలం



ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి

అవినీతి అనకొండ ఉషశ్రీ

కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పాలి..

- లేదంటే మేమే చెబుతాం..
- అందరికీ అన్నంపెట్టే రైతుల భూములను కబ్జాచేసిన హీన చరిత్ర మంత్రిది..
- వేల మందికి అన్నం పెట్టిన ఘనత నాది..
- నాపైనే బురదజల్లే ప్రయత్నమా?
- ఓటమి భయంతోనే వలసపక్షి ఆరోపణలు

ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఫైర్



విలేకరులతో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 30: రాష్ట్రంలోనే అవినీతిలో మంత్రి ఉషశ్రీ చరణ్‌ను మించిన వారు లేరనీ, అవినీతి అనకొండ అని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆరోపించారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మంత్రిపై సవిత ఫైర్ అయ్యారు. మంత్రికి ఓటమి భయం పట్టుకుందన్నారు. దానిని జీర్ణించుకోలేక తనపై లేనిపోని ఆరోపణలు చేస్తోందన్నారు. ఆఖరుకు కుటుంబ విషయాలపై కూడా మాట్లాడుతోందన్నారు. తాను తల్లికి అన్నం పెట్టడం లేదనీ, అఫిడవిట్‌లో కేసులు పొందుపరచలేదని మంత్రి ఆరోపించడం శోచనీయమన్నారు. అన్నక్యాంటీన్ ద్వారా వేల మందికి, ఆస్పత్రి వద్ద ప్రతీవారం గర్భిణులకు, పెనుకొండలో ఏ కార్యక్రమం జరిగినా కడుపునిండా అన్నం పెట్టిన ఘనత తనదన్నారు. అందరికీ అన్నంపెట్టే రైతుల భూములు లాక్కున్న హీన చరిత్ర మంత్రిది అని మండిపడ్డారు. తనపై బురద జల్లాలని చూస్తే.. పెనుకొండ ప్రజలు తనపై పూలవర్షం కురిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తనపై అక్రమ కేసులు పెట్టింది వైసీపీవారేననీ, పార్టీ మారాలని ఒత్తిడి తెచ్చారనీ, అందుకు ఒప్పుకోకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు, ఆస్తి నష్టం కలిగించారన్నారు. ఈ ఐదేళ్లలో మంత్రి కూడబెట్టిన ఆస్తులపై పెద్ద బుక్కు వేయాల్సి ఉంటుందని సవిత దుయ్యబట్టారు. మంత్రికి 2019లోలేని బంగళాలు, కార్లు, క్యారవాన్, 7 కేజీల బంగారం, వెండి ఎలా వచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తామే చెబుతామన్నారు. ఇప్పటికైనా లేనిపోని ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, నాయకులు త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, మండల కన్వీనర్ శ్రీరాములు పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో జగన్ భవిష్యత్తు గల్లంతు

కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి

మడకశిరటౌన్, ఏప్రిల్ 30: కూటమి ఉమ్మడి మేనిఫెస్టోతో జగన్ భవిష్యత్తు గల్లంతైనట్లేనని హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. జగన్‌కు అధికారం కోల్పోతున్నామన్న విషయం అర్థమైపోయిందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం అమరాపురం మండలం హేమావతిలో ఆయన.. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామితో కలిసి పర్యటించారు. బీకే మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వస్తే అన్నివర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడంతోపాటు రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు 50 సంవత్సరాలకే పింఛను, వృద్ధాప్య పింఛను రూ.4వేలకు పెంపు, దివ్యాంగులకు రూ.6వేలు, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, 20 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగభృతి, తల్లికి వందనం, మూడు గ్యాస్ సిలిండర్ల ఉచితం, ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం, వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం, భూహక్కు చట్టం రద్దు, బీసీ రక్షణ చట్టం, ఇలా సంక్షేమ ఫలాలు అందజేస్తామన్నారు. వైసీపీ గత ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలనే నెరవేర్చలేకపోయిందన్నారు. మళ్లీ వారు చేస్తారంటే ప్రజలు విశ్వసించడం లేదన్నారు. తెలుగుదేశం పార్టీని ఆదరించి సైకిల్ గుర్తుకు ఓటువేసి, మంచి మెజార్టీతో గెలిపిస్తేనే నియోజకవర్గంలో ఆగిపోయిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు. కూటమి అభ్యర్థుల ప్రచారానికి అడుగడుగునా ప్రజలు పూలవర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పట్టారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండుటాకులపై శాడిజం..!

- పింఛన్‌దారులకు ప్రభుత్వం ఇక్కట్లు
- బ్యాంకుల్లో సొమ్ము జమకు ఆదేశాలు
- రాజకీయ ప్రయోజనాలకే మొగ్గు
- లబ్ధిదారులకు తప్పని తిప్పలు
- ఆ నెపాన్ని ప్రతిపక్షాలపై వేసే కుట్ర
- ఇంటింటి పంపిణీకి అవకాశమున్నా.. చేయని వైనం

ధర్మవరం, ఏప్రిల్ 30: సామాజిక పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ సర్కారు మరో ఎత్తుగడకు తెరతీసింది. పండుటాకులపై శాడిజం ప్రదర్శిస్తోంది. బ్యాంకుల్లో పింఛన్ సొమ్ము జమ చేసేందుకు నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంతో ఎక్కడో దూరంలో ఉండే బ్యాంకుల వద్దకు మండుటెండలో పింఛన్‌దారులు వెళ్లి, అక్కడ పడిగాపులు కాయక తప్పదు. పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేసి, ఆ నెపాన్ని ప్రతిపక్షాలపై వేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నది బహిరంగ రహస్యమే. సామాజిక పింఛన్ సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమచేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలివ్వడంపై పింఛన్‌దారులు, రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. పింఛన్‌దారులతో రాజకీయాలేమిటని వారు మండిపడుతున్నారు. ప్రతిపక్షాలపై తప్పు నెట్టి, వైసీపీకి మేలు చేసే విధంగా సీఎస్ ఇటువంటి నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో గత నెలలో ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. కొంతమంది సచివాలయాలకు వచ్చినా అత్యధికంగా పింఛన్‌దారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది వెళ్లి, పంపిణీ చేశారు. కొంతమంది లబ్ధిదారులు.. సచివాలయాల వద్దకే వెళ్లి పింఛన్ తీసుకున్నారు. మే నెలలో అలా ఎందుకు అందించలేరని పలువురు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకుల్లో పింఛన్ సొమ్ము జమచేయడం ఏమిటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్యాంకులకు వెళ్లలేని వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇస్తామనడం వెనుక అసలు కారణాలేమిటని మండిపడుతున్నారు. సచివాలయ, ఇతర సిబ్బంది ద్వారా పింఛన్‌దారులందరికీ ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఇస్తే నష్టం ఏమిటని ధ్వజమెత్తుతున్నారు. ఏదేమైనా వైసీపీ రాజకీయ లబ్ధి కోసమే ఇదంతా చేస్తోందని మరికొంతమంది ఆరోపిస్తున్నారు. చాలినంత మంది సిబ్బంది ఉన్నా.. ఇంటింటికీ పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం కావాలనే మోకాలడ్డుతోందని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రత్తలు 45 డిగ్రీలపైనే నమోదవుతున్న నేపథ్యంలో దూరప్రాంతాల్లో ఉన్న బ్యాంకులకు పింఛనుదారులు వెళ్లి సొమ్ము డ్రా చేసుకోవాలంటే ఇబ్బందులు తప్పవు.



ముదిగుబ్బ సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

-ధర్మవరం మండలంలోని రేగాటిపల్లి, మచ్చురామి, పోతుకుంట, కుణుతూరు, చిగిచెర్ల, చింతలపల్లి, ఉప్పునేశనపల్లి, ఓబుళనాయనపల్లి, చిన్నూరు బత్తలపల్లి, నేలకోట తదితర గ్రామాల పింఛన్‌దారులు ధర్మవరంలోని బ్యాంకులకు రావాల్సి ఉంటుంది. ఇక్కడే పింఛన్ సొమ్ము డ్రా చేయాల్సి ఉంటుంది. వీరంతా ఆ సొమ్ము కోసం రానుపోను ఆటో చార్జీలతోపాటు మధ్యాహ్నం భోజనం ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఎండలో పండుటాకులకు ఇబ్బందులు తప్పవు. సామాజిక పింఛన్‌దారులు ఎవరో ఒకరితోడుగా బ్యాంకులకు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇంటి వద్దకు కొందరికే..: నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

దివ్యాంగులు, దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితమైన వారు, నడవలేని వారికి ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము అందజేస్తాం. బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయిన వారికి సొమ్ము ఖాతాలోకి జమవుతుంది. ఎవరూ సచివాలయాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు.


ఎవరు పిలిచినా వస్తాం.. నచ్చినోడికి ఓటేస్తాం !



ఎన్నికల వేళ గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. కొంతమంది ఏ పార్టీ నాయకులు పిలిచిన ర్యాలీ, ప్రచారానికి వెళ్తన్నారు. ఇదే విషయాన్ని కొందరు నేతలు వారిని ప్రశ్నిస్తే నా ఓటు నీకే వేస్తామన్నా అని చెబుతున్నారు. దీంతో అభ్యర్థులలో అయోమయం నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఎటువంటి ఇబ్బంది ఉండరాదన్న ఉద్దేశ్యం తోనే కొందరు అలా ప్రవర్తిస్తున్నట్టు తెలుస్తోంది. టీడీపీ, వైసీపీ నాయకులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఘనంగా స్వాగతం పలకాలన్న ఉద్దేశ్యంతో గ్రామస్థాయి నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రచారానికి రావాలని కోరుతున్నారు. దీంతో ఇరు పార్టీలకు జనం తండోపతండాలుగా వస్తున్నారు. దీంతో వీరు ఎవరికి ఓటు వేస్తారో అన్న అయోమయంలో పార్టీల నాయకులు, అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నా రు. కొంత మంది మాత్రం ప్రచారానికి వస్తాం, ఎన్నికల సమయంలో మాకు నచ్చిన వారికి ఓటు వేస్తామని నిక్కచ్చిగా చెబుతున్నారు. ఈక్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులు గ్రామాల్లో ప్రజలు నాడిని కనుక్కునేందుకు సొంత సర్వేలు చేయించుకుంటున్నారు.

- కొత్తచెరువు

ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా?



భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్ల నిండిన భారతీయపౌరులు ఓటు హక్కు ఉంటుంది. వివిధ కారణాల వలన జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా? ఉండదా అనే ప్రశ్న చాలా మందికి తలెత్తవచ్చు. అయితే ఖైదీలు కూడా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశముంది. వివిధ నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రీవెంక్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ, తాము ఓటర్లమని, పోలింగ్ బూత్, ఓటరు క్రమ సంఖ్యతో ఓటు వేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాలనుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి, ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

- కదిరిఅర్బన్

ఓటు వేయడానికి ఇవి చూపిస్తే చాలు



వచ్చే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా ప్రత్యామ్నాయంగా వివిధ గుర్తింపు పత్రాలు చూపించి ఓటు వేసే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులను ఎన్నికల కమిషన్ ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఓటు వేయడానికి ముందు పోలింగ్ కేంద్రంలో వారి గుర్తింపు నిర్ధారణకు పంపిణీ చేసిన ఓటరు స్లిప్పులు మాత్రమే చూపిస్తే సరిపోదు. ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ కార్డులు ఇవే..

ఆధార్‌కార్డు, ఎంఎన్ఆర్‌జీఏ, పాన్‌కార్డు, పోస్టాఫీసు లేదా బ్యాంకు జారీ చేసిన ఫొటో ఉన్న పాసు పుస్తకం, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఇండియన్ పాస్‌పోర్టు, ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్డు, దివ్యాంగుల ఐడీ కార్డు, ఎమ్మెల్యే, ఎంపీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కును వినియో గించుకోవచ్చు.

- కొత్తచెరువు


జన కేతనం



ఆంధ్రజ్యోతి

పెనుకొండ విజయంలో...

గోరంట్లే కీలకం..!



గోరంట్ల పాతబస్టాండ్ కూడలిలో నీడనిస్తున్న మర్రిచెట్టు

గోరంట్ల, ఏప్రిల్ 30: పెనుకొండ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించేది గోరంట్ల ఓటర్లే. నియోజకవర్గంలోని అన్ని మండలాకంటే గోరంట్లలో అత్యధికంగా 64,434 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 32,050 మంది పురుషులు, 32,380 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. మండల ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపితే ఆ అభ్యర్థే గెలుస్తారని తెలుస్తోంది. పెనుకొండ నియోకవర్గంలో మొత్తం 265 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,35,986 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,17,952 మంది పురుషులు, 1,18,030 మంది మహిళలు, 4 థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. మిగిలిన మండల్లాలో.. పెనుకొండ అర్బన్‌లో 22,138 మంది, రూరల్‌లో 23,075, సోమందేపల్లిలో 39,273, పరిగిలో 46,500, రొద్దంలో 40,568 మంది ఓటర్లు ఉన్నారు. గోరంట్ల మండలంలో అధిక శాతం ఓట్లు ఉండడంతో కీలకంగా మారుతోంది. దీంతో అన్నిపార్టీల అభ్యర్థులు గోరంట్ల మండలంపై ప్రత్యేక దృష్టి సారించడం ఆనవాయితీగా వస్తోంది.

అప్పట్లో కొందరికే ఓటు హక్కు..



ఇప్పుడంటే దేశంలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేస్తున్నారు కానీ ఒకప్పుడు అలా ఉండేది కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో ఉద్యోగులు, చదువుకున్నవారు, భూస్వాములకు మాత్రమే ఓటు వేసే అవకాశం ఉండేది. అప్పట్లో మండలాలను ఫిర్కాలుగా పిలిచేవారు. ప్రస్తుత వీఆర్ఓలకు బదులుగా అప్పుడు వీఎం(విలేజ్ మేజిస్ట్రేట్)లు ఉండేవారు. వీరివద్దే ఓటర్లుగా నమోదు చేయించుకునేవారు. ప్రత్యక్ష పద్ధతిలో బహిరంగసభలో చేతులెత్తి ఓటు హక్కును వినియోగించుకునే వారు. 1952, 1951లో ఒక అభ్యర్థికి ప్రత్యేకంగా ఒక పెట్టె ఏర్పాటు చేసేవారు. వాటిలోనే ఓటువేసేవారు. అనంతరం అభ్యర్థులు ఎందరైనా ఒకే పెట్టెలో ఓటువేసే విధానం వచ్చింది. బ్యాలెట్ ఓటు విధానం అనంతరం, ఈవీఎంలను ఎన్నికల్లో వినియోగించడం ప్రారంభమైంది.

- హిందూపురం



మల్లయ్య కాలనీ

> ఆ కాలనీ అనంతపురం నగరానికి కూత వేటు దూ రంలో ఉంది.. అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. రూరల్ మండలంలోని మల్లయ్యకాలనీ (అన్నెఫెర్రర్ కాలనీ)లో కనీస సౌకర్యాలు లేక సతమతమవుతున్నారు. గత ఎన్నికలకు ముందు రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కుటుంబికులు ప్రచారానికి వెళ్లినప్పుడు సమస్యలన్నీ పరిష్కరిస్తామ ని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గె లిచాక ఐదేళ్లలో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కాలనీ వైపు తొంగిచూడలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లయింది.. మళ్లీ రాలేదు..!

- అభివృద్ధికి నోచుకోని మల్లయ్య కాలనీ
- గత ఎన్నికల్లో అభివృద్ధికి హామీలు
- మౌలిక వసతులు లేక అవస్థలు
- రాప్తాడు ఎమ్మెల్యేపై కాలనీవాసుల ఆగ్రహం





కాలనీలోని ప్రధాన రోడ్డు

అనంతపురం రూరల్

అక్కడ ఉన్న వారంతా పేదలే. కూలి పనులకు వెళితే తప్పా పూట గడవని పరిస్థితి. కాలనీ ఏర్పడి దశాబ్ద కాలం గడుస్తున్నా కనీస మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీ మల్లయ్యకాలనీ (అన్నె ఫెర్రర్ కాలనీ) దుస్థితిని పట్టించుకునే నాథుడే లేడు. నగరానికి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్నా అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. కాలనీలో దాదాపు 200 కుటుంబాలకు పైగా నివాసముంటున్నాయి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా తన కుటుంబ సభ్యురాలు ఒకరిని పంపి ప్రచారం చేయించారు. వైసీపీ అధికారంలోకి వస్తే కాలనీ రూపురేఖలు మారుస్తామని, రోడ్లు, కాలువలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇచ్చారు. దీంతో స్థానికులు వైసీపీ అధికారంలోకి వస్తే కాలనీ అభివృద్ధి చెందుతుందన్న ఆశతో ఓట్లు వేసి గెలిపించారు. అంతంటితో సరి. ఆ తరువాత హామీలు ఇచ్చిన దూతకానీ, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కానీ ఐదేళ్లలో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కాలనీ వైపు చూసింది లేదంటున్నారు స్థానికులు. ఇటీవలే కాలనీలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే కాలనీ ఇలా ఉందని తాను అనుకోలేదని.. ఈసారి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని కాలనీ వాసులు చెబుతున్నారు. తమను ఓటర్లుగా మాత్రమే చూస్తున్నార తప్పా, కాలనీ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ ఏమాత్రం మారలేదు

మేము కాలనీ ఏర్పాటయినప్పటి నుంచి ఉంటున్నాం. అప్పటికి ఎలా ఉందో..ఇప్పటికీ అలాగే ఉంది. ఏమాత్రం మార్పు లేదు. రాత్రివేళల్లో విషపురుగులు సంచరిస్తున్నాయి. మరో చోటుకు వెళ్లలేము. మా కష్టాలు మాకు తప్పవు. ఎన్నికల సమయంలో నాయకులు రావడం హామీలు ఇవ్వడం తప్పా చేసిందేమీ లేదు. కాలనీలోకి వచ్చేందుకు బ్రిడ్జి, రోడ్లు, కాలువలు వేయిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏదీ జరగలేదు.

- రమాదేవి, కాలనీవాసి



ఒక్క హామీ కూడా నెరవేరలేదు



గత ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు చందు భార్య కాలనీలో ప్రచారం నిర్వహించారు. అప్పుడు కాలనీలో రోడ్లు, కాలువలు, ఇతర సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని చెప్పివెళ్లారు. ఇంతవరకు ఒక్క హామీ కూడా నెరవేరలేదు. అంతేకాదు.. కాలనీలో టీడీపీ సానుభూతిపరులెవరైనా బియ్యం కోసం ఒకటి రెండు రోజులు ఆలస్యం అయితే డీలర్ బియ్యం అయిపోయాయంటూ వెనక్కు పంపించేస్తున్నారు. కాలనీలో పరిస్థితి అధ్వానంగా ఉంది. వైసీపీ నాయకులు చెప్పినట్లు వింటే సరి లేదంటే గొడవలు సృష్టించేస్తారు. ఈ గొడవలు పడలేక చాలా మంది వెళ్లిపోయారు.

- గుల్జారమ్మ, కాలనీవాసి





కాలనీలో లేని రోడ్డు కాలువలు

ఏ నాయకుడూ రాలేదు

కాలనీలో ఎనిమిదేళ్లుగా నివాసముంటున్నాం. ఏనాడూ.. ఏ నాయకుడు కాలనీ వైపు వచ్చింది లేదు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే మేము కనిపిస్తున్నాం. ఓట్లు వేయించుకుని గెలిచిన నాయకులకు మేము..మా కాలనీ కనిపించదు. రోడ్లు, కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏడాది కిందట వర్షం వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరాయి. ఎవరూ ఇటువైపు వచ్చి మా సమస్యలు అడిగింది లేదు. కాలనీ వాసులమంతా వారం పదిరోజులు ఎన్ని ఇబ్బందులు పడ్డామో మాకే తెలుసు.

- అరుణ, కాలనీవాసి

కలగా మిగిలిన రింగ్‌రోడ్డు



రింగ్‌రోడ్డు గురించి అధికారులతో టీడీపీ నాయకుల చర్చ(ఫైల్)

టీడీపీ పాలనలో మడకశిర పట్టణాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు ప్రారంభించారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పనులు నిలిచిపోయాయి. టీడీపీ పాలనలో నాయకులు ఎంతో కష్టపడి పట్టణం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించడానికి రైతుల నుంచి 15 ఎకరాల భూమి సేకరించారు. చౌటిపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పనులు కూడా ప్రారంభించారు. ఆ సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దాని గురించి పట్టించుకోలేదు. దీంతో ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం తమకు కలగానే మిగిలిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

-మడకశిర రూరల్

పెరిగిన జంపింగ్‌లు



సార్వత్రిక ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు అంటూ కార్యకర్తలు, నాయకుల జంపింగ్‌లు అధికమయ్యాయి. పార్టీలో చేరే వారికి నిత్యం కండువాలు కప్పడానికే అభ్యర్థులకు సగం సమయం సరిపోతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కొందరు స్థానిక నాయకులు రాజకీయంగా క్రియాశీలకంగా లేని అవతలి పార్టీ కార్యకర్తలను సైతం తమ పార్టీ అభ్యర్థులు, నాయకుల వద్దకు తీసుకెళ్లి వారి గురించి గొప్పలు చెప్పి పార్టీ కండువాలు వేయించేస్తున్నారు. ఇప్పటివరకు ఉన్నపార్టీని వీడి హఠాత్తుగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో అవతలి పార్టీలో చేరుతుండటంతో ఆయా అభ్యర్థులు సైతం ఆశ్చర్యపోతున్నారు. మరోవైపు వీరందరూ కోవర్టులేమోనన్న భయం కూడా వారిని వెంటాడుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది ధర్మవరం పట్టణంతోపాటు మండలాల్లో కూడా చేరికలు ఎక్కువగా జరుగుతున్నాయి.

- ధర్మవరం

అన్నన్నా!

నోటికాడ కూడు లాగేశారు..!



బళ్లారి బైపాస్ సర్కిల్‌లోని అన్న క్యాంటీన్ భవనం

ఇక్కడ కనిపిస్తున్న భవనం బళ్లారి బైపాస్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్. టీడీపీ హయాంలో నిత్యఅన్నదాన సత్రంలా కళకళలాడింది. ఎంతో మంది ఆకలి తీర్చింది. చుట్టుపక్క ప్రాంతాలు, వివిధ పనులపై నగరానికి వచ్చిన వారు వచ్చి ఈ క్యాంటీన్‌లో ఐదు రూపాయలకే కడుపు నిండా అన్నం తినేవారు. వందల మంది కూలీలు, హమాలీలకు బైపాస్ సర్కిల్ కేంద్ర బిందువు. వారందరికీ ఈ క్యాంటీన్ కడుపునింపింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ క్యాంటీన్‌ను మూసివేశారు. ప్రస్తుతం ఆ భవనం మున్సిపాలిటీ అవసరాల కు మాత్రమే ఉపయోగపడుతోంది. భవనం అద్దాలు పగిలిపోయాయి. భవనం చెత్త చెదారం, దుమ్ము, ధూళితో నిండిపోయింది. ఎంతో మందికి అన్నం పెట్టిన క్యాంటీన్ మూసివేయడం అంటే పేదల నోటి కాడ..కూడు లాగేసుకోవడమేనని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అనంతపురం రూరల్

యువతే భవిత

> ఎన్నికల్లో వీరిదే కీలకపాత్ర
> ఎటువైపు మొగ్గితే అటువైపే విజయం
> గత ఐదేళ్లలో యువజన సంఘాలు నిర్వీర్యం
> ఓట్ల కోసం వ్యసనాలకు బానిసలుగా మారుస్తున్న పార్టీలు

హిందూపురం

దేశ అభివృద్ధి, భవిష్యత్తును నిర్దేశించేది ఆ దేశ యువతే. బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో వీరిదే కీలక పాత్ర. ప్రపంచీకరణకు ముందు మేలైన సమాజ నిర్మాణంలో కూడా యువత చైతన్యవంతంగా ఉండేది. ఇందు కోసం యువజన సంఘాలు సైతం ఏర్పడ్డాయి. అందుకే ఎన్నికల సమయంలో వివిధ పార్టీల అభ్యర్థులు వీరి మద్దతు కోసం తీవ్రంగా ప్రయత్నించేవారు. కాలక్రమేణ యువజన సంఘాలు కనుమరుగయ్యాయి. ఈక్రమంలోనే చైతన్యానికి మారుపేరుగా నిలిచిన యువతను కొన్ని పార్టీలు, కొందరు నాయకులు తమ రాజకీయ ప్రయోజనాలు, ఓట్ల కోసం వ్యసనాలకు బానిసలుగా మారుస్తున్నారు.

వారంటే ప్రత్యేక గౌరవం



ఒకప్పుడు సామాజిక రుగ్మతలపై యువజన సంఘాలు నిరంతరం కార్యకలాపాలు నిర్వహించేవారు. అక్షరాస్యత శాతాన్ని పెంచడంతోపాటు ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే యువకుల్లో మార్పు తీసుకురావడంలో, స్థానిక సంస్థల పరిష్కారానికి కృషిచేసేవి. వీటితోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించేవారు. శారీరక పటుత్వం కోసం వ్యాయామశాలలు నిర్వహించేవారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో యువజన సంఘాలు కొనసాగుతుండేవి. అనంతర కాలంలో ప్రాచుర్యం పొందిన క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ సత్సంబంధాలు నడిపేవారు. అదే సమయంలో చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించేవారు. పల్లెల్లో పట్నాల్లో జాతరలో సామూహిక కార్యక్రమాల్లో వలంటీర్లుగా సేవలందించేవారు. ప్రభుత్వాలు కూడా యువజన సంఘాలతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించేవి. దీంతో యువజన సంఘాల సభ్యులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉండేది. విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో కూడా అధికంగా చేరేవారు. కానీ నేడు ఇలాంటివి కనుమరుగవుతున్నాయి.

యువజన సంఘాలు కనుమరుగు

జీవన అలవాట్లు, ఆలోచనవిధానాలు, సమాజ పోకడలు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా యువజన సంఘాలు కనుమరుగవుతున్నాయి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో అందరిచేతుల్లో స్మార్ట్‌ఫోన్‌లు వచ్చి చేరాయి. దీంతో కొందరు విజ్ఞానం పొందుతుండగా మరికొందరు పెడత్రోవపడుతున్నారు. ప్రభుత్వాలు కూడా యువజన శాఖను పూర్తి నిర్లక్ష్యం చేయడంతో ఆశాఖ ద్వారా నిర్వహించాల్సిన కార్యకలాపాలకు స్వస్తి పలికారు. గడచిన ఐదేళ్లలో యువజన సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు.

నిలదీతే పరిష్కారం

యువతను పెడద్రోవ పట్టిస్తూ స్వప్రయోజనాలు చూసుకుంటున్న నాయకులను నిలదీయడమే ఇందుకు పరిష్కారమని సామాజికవేత్తలు అంటున్నారు. ఓటును వజ్రాయుధంగా వాడాలని సూచిస్తున్నారు. ఫిరాయింపులు, మద్యం పంపిణీ, గొడవలకు యువతను ముందుంచడం పై ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ఈ ఐదేళ్లలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కడా కనిపించలేవు. దీంతో అలాంటి నాయకులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు నిలదీయాలని సూచిస్తున్నారు.

ఎన్నికల ప్రభావంతో యువతను వ్యసనాలకు బానిసలుగా మారుస్తున్న నాయకులకు ఓటుద్వారా బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గెలుపోటముల్లో కీలకం

ఎన్నికల సమయంలో అభ్యర్థుల గెలుపోటములు యువతపైనే ఆధారపడి ఉంటాయి. ఎందుకంటే ఎన్నికల్లో యువత ఓటు శాతం అధికంగా ఉంది. దీనివల్ల వారు ఎటువైపు మొగ్గు చూపితే అటువైపు విజయం సాధించే అవకాశం ఉంటుంది. దీంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు యువతపై ఓ కన్నేసి వారి ఓట్లను పొందేందుకు మార్గాలను అన్వేషిస్తున్నాయి.

ఎన్నికల్లో అధికారులే కీలకం

జిల్లా, గ్రామస్థాయి వరకు ప్రధానపాత్ర.. వారి పర్యవేక్షణలోనే ఎన్నికల సమరం

ధర్మవరం

సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకం. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ అధికారులదే కీలక పాత్ర. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రధాన ఎన్నికల అధికారిని సంప్రదిస్తుంది. ఆయన పర్యవేక్షణలోనే ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో జిల్లా, నియోజకవర్గ, మండలం, గ్రామస్థాయిలో పనిచేసే అధికారులు వివరాలు ఇలా...

జిల్లా ఎన్నికల అధికారి

ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రతి జిల్లాకు ఎన్నికల అధికారి ఉంటారు. పాలనాధికారి(కలెక్టర్)ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలు చేయడంలో కలెక్టర్ ప్రధాన పాత్ర పోషిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తారు.

రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ)

ఎన్నికల నిర్వహణకు కేంద్రం రిటర్నింగ్ అధికారిని నియమిస్తుంది. ఈ అధికారి సంబంధిత నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారు. నామినేషన్ ప్రక్రియ, తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి సిబ్బంది నియామకం. వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి అంశాలు ఆర్ఓ పర్యవేక్షణలోనే జరుగుతాయి.

సెక్టోరియల్ అధికారి

8-10 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడానికి సెక్టోరియల్ అధికారులను నియమిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అవసరమైతే పరిస్థితులకు అనుగుణం గా ఆయా చోట్ల 144 సెక్షన్ విధించే అధికారి ఆయనకు ఉంటుంది.

ఓటర్ల నమోదు అధికారి

ఓటర్ల నమోదు అధికారి ప్రతి నియోజకవర్గ స్థాయిలో ఉంటారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు, జాబితాలో పేర్లు, ఫొటోలు తప్పుగా ఉన్నవారంతా ఆయనను సంప్రదించాలి. ఆయన పర్యవేక్షణలోనే సిబ్బంది ఓటరు జాబితాసతయారు చేస్తారు.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి(పీఓ) ఉంటారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి, అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చేవరకు వీరిదే బాధ్యత. వీరితో పాటు సహాయ ప్రిసైడింగ్ అధికారు(ఏపీఓ)లు ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని కార్యకలాపాలు పీఓ పర్యవేక్షణలో జరుగుతాయి.

సూక్ష్మ పరిశీలకులు

ఎన్నికలు జరిగిన తీరు, పర్యవేక్షణపై నివేదిక రూపొందించి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించడానికి సూక్ష్మ పరిశీలకులను ఏర్పాటు చేస్తారు. ప్రతి మండలానికి ఒకరు ఉంటారు. వారంతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)

ప్రతిపోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ అధికారి ఉంటారు. కొత్తగా ఓటరు జాబితాలో చేరే వారికి ఫాం-6, తొలగింపునకు ఫాం-7, తప్పుల సవరణకు అవసరమైన ఫారాలు ఇవ్వడం, అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకునేలా చూడటం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతి పాదించడం, ఓటర్ల జాబితా ప్రదర్శన, కేంద్రాల్లో మార్పులకు బీఎల్ఓలు పనిచేస్తుంటారు.



గొంతెండుతోంది

ఉరవకొండలో 20 రోజులకోసారి నీటి సరఫరా

ఉరవకొండ, ఏప్రిల్ 30: పట్టణంలో తాగునీటి సమస్య జటిలమైంది. 20 రోజులకు ఒక్కసారి నీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉరవకొండలో 45 వేల మంది నివసిస్తున్నారు. 20 వార్డులు ఉన్నాయి. పట్టణానికి నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు , పీఏబీఆర్ డ్యాం నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. ఉరవకొండతో పాటు ఏడు గ్రామాలకు తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు అడుగంటిపోయాయి. బండల ట్యాంకులో మీటరు ఎత్తులో మాత్రమే నీరు నిల్వ ఉంది. ఈ నీటిని ట్యాంకుల్లోకి మోటార్లు వేసి రెండు గ్రామాలకు నేరుగా సరఫరా చేస్తున్నారు. పీఏబీఆర్ నుంచి రోజుకు 18లక్షల లీటర్లకుగానూ సగం కూడా సరఫరా కావడం లేదు. ఆ వచ్చిన నీటిని వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లోని గ్రామాలకు సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం 20రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతోంది. అది కూడా అరకొరగా వదులుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.800 చెల్లించి ట్యాంకర్ నీటిని కొనుక్కోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. బోర్లు వేసినా ఆశించిన మేర నీరు పడలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో మూడు బోర్లు వేసినా 4 ఇంచులు మాత్రమే వస్తోంది. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో సమస్య తీవ్రమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


ఎండిపోయిన నింబగల్లు చెరువు

ఒంటికాలిపై నిరసన

తాగు నీటి కోసం 11వ వార్డుకు చెందిన శివ అనే వ్యక్తి ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశాడు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలు మెడలో వేసుకుని ప్లకార్డులు చేత్తో పట్టుకుని ఆందోళనకు దిగాడు. 20రోజులు అయినా అధికారులు తాగు నీరు సరఫరా చేయడం లేదన్నారు. నీటి సమస్యను విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విచ్చలవిడిగా కుళాయిలు వేయడం వల్ల నీరు సక్రమంగా రావడం లేదన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.



రెచ్చిపోతున్న వైసీపీ అల్లరి మూకలు

బుక్కపట్నం, ఏప్రిల్ 30: పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అండతో వైసీపీ అల్లరి మూకల రోజురోజుకు రెచ్చిపోతున్నాయి. మండలంలోని పాముదుర్తి గ్రామానికి టీడీపీ ప్రచార వాహనం మంగళవారం వెళ్తుండగా గరుగుతండా సమీపంలో వైసీపీ నాయకులు అడ్డుకుని దాన్ని ధ్వంసం చేశారు. అంతేకాక డ్రైవర్ సెల్‌ఫోన్ లాక్కుని నానా హంగామా చేశారు. ఇటువైపు వస్తే చంపేస్తామంటూ బెదిరించారు.


ధ్వంసమైన ప్రచార వాహనం

ఇసుకే బంగారం..!


ఎద్దుల బండ్లపై ఇసుక తరలింపు (ఫైల్)

- ట్రాక్టర్ ఇసుక రూ.3 వేలు
- సొంతింటి కలకు అడ్డంకిగా మారిన వైనం
- నిబంధనల పేరుతో పేదలకు ఇక్కట్లు

చిలమత్తూరు, ఏప్రిల్ 30: వైసీపీ పాలనలో ఇసుక బంగారంలా మారిపోయింది. దీంతో సామాన్యులు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బండెడు ఇసుక కావాలన్నా రూ. 1200 నుంచి రూ. 1500ల ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. అదీ కూడా ప్రభుత్వ అనుమతితోనే. లేదంటే ఇంటి వరకు ఇసుక రాదు. ఈ అనుమతుల కారణంగా వైసీపీ పాలనలో ఇసుక ధరలు మరింత ప్రియం అయ్యాయని ప్రజలు వాపోతున్నారు.

ట్రాక్టర్ ఇసుక రూ.3 వేలు

గతంలో ట్రాక్టర్ ఇసుక ధర రూ. వెయ్యి రూపాయలు ఉండేది. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఇసుకను తెచ్చుకునే వీలుండేది. కానీ ఇప్పుడు అనుమతుల పేరుతో కాలయాపన చేయడం, రవాణాకు నిర్దిష్ట సమ యాన్ని కేటాయించి అనుమతులు ఇవ్వడంతో ఇబ్బందులు తలెత్తుతున్నా యి. ఈ కారణాలతో ట్రాక్టర్ల యజమానులు కూడా విపరీతంగా ధరలు పెంచేశారు. ఒక ట్రాక్టర్ ఇసుక ధర రూ. 3 వేల నుంచి రూ. 4 వేలు వరకు పలుకుతోంది. గ్రామ సచివాలయాల్లో ఇసుక అనుమతులు వైసీపీ నాయకులకే ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇసుక రవాణానే వృత్తిగా...

వైసీపీ పాలనలో ఇసుక ధరలు విపరీతంగా పెరగడంతో కొందరు ఇసుక రవాణానే వృత్తిగా ఎంచుకుంటున్నారు. అన్నింటికంటే మంచి ఆదాయ వనరుగా ఇసుక రవాణా మారడంతో ఎక్కువ మంది దీని వైపే మొగ్గు చూపుతున్నారు. ఈక్రమలోనే కొత్త, కొత్త ట్రాక్టర్లు, టిప్పర్లు పెరిగిపోతున్నా యి. సొంతంగా ఇళ్లు కట్టుకోవాలన్నా కూడా ఇసుక కొరత తీవ్రంగా ఉంది. అధికారులు మాత్రం అక్రమ రవాణాను అరికట్టేందుకుకే నిబంధనలు కఠినం చేశామంటూ ఇసుకకు కృత్రిమ డిమాండ్ సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఉద్యోగుల బరితెగింపు..!

వైసీపీ సేవలో సెబ్ హెడ్‌కానిస్టేబుల్, పోస్టల్ బీపీఎం

బుక్కపట్నం, ఏప్రిల్ 30: నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో కొందరు ప్రభుత్వం ఉద్యోగులు తరిస్తున్నారు. ఇందుకు మండలంలోని పాముదుర్తి గ్రామంలో మంగళవారం జరిగిన సంఘటనే ఉదాహరణ. ఆ గ్రామంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాముదుర్తికి చెందిన సెబ్ హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్ ఇంటి ముందు షామియానాలు ఏర్పాటు చేసి, ప్రచారం చేశారు. కానిస్టేబుల్ రాజగోపాల్ ప్రచారంలో పాల్గొనడమే కాకుండా, పార్టీ కార్యకర్తలా ప్రవర్తిస్తూ హల్‌చల్ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లఘించి ప్రచారంలో పాల్గొన్న రాజగోపాల్‌ను సస్పెండ్ చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.


ప్రచారంలో పాల్గొన్న సెబ్ హెడ్‌కానిస్టేబుల్

తపాలా ఉద్యోగి..


వైపీసీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పోస్టల్ ఉద్యోగి పాటిల్ సుబ్బారెడ్డి

అనంతపురం: కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామానికి చెందిన తపాల ఉద్యోగి పాటిల్ సుబ్బారెడ్డి వైసీపీ సేవలో తరిస్తున్నాడు. ఈయన గ్రామంలోనే బీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన హుస్సేన్‌ను తిరిగి వైసీపీలోకి రప్పించాడు. ఆయనకు వైసీపీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

మనోళ్లంతా యాడాడ ఉండారో..?



మనోళ్లంతా యాడాడ ఉండారో రేంత ఎతకండప్పా అంటూ గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు.. కార్యకర్తలను పురమాయిస్తున్నారు. ప్రస్తుత ఎన్నికలు ప్రధాన పార్టీలకు జీవన్మరణ సమస్యగా మారడంతో క్షేత్రస్థాయిలో నాయకులు ప్రతి ఓటును కీలకంగా భావిస్తున్నారు. ఈక్రమంలోనే గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు పొట్టకూటి కోసం వలస వెళ్లిన ఓటర్ల కోసం వెదుకులాట ప్రారంభించారు. మడకశిర నియోజకవర్గంలో దాదాపు 20శాతం మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. గ్రామంలో ఎవరు ఉన్నారు? ఎవరు వలస వెళ్లారు అన్న విషయాన్ని వలంటీర్లు ఇంటింటి సర్వే ద్వారా ఇదివరకే గుర్తించారు. ఆ జాబితా పట్టుకుని స్థానిక నాయకులు పోలింగ్ తేదీ సమయానికి వలస ఓటర్లను రిప్పించే యత్నాలు చేస్తున్నారు. వారికి ప్రయాణ చార్జీలు, ఇతర ఖర్చులు కూడా భరించడానికి నాయకులు వెనుకాడటంలేదని సమాచారం.

\- మడకశిర రూరల్

సంచలనాలకు మారుపేరైన తాడిపత్రి నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఫ్యాక్షన్ పేరు చెబితే తాడిపత్రి గుర్తుకు వచ్చేటంత స్థాయిలో పేరుమోసింది. ప్రత్యర్థులను భౌతికంగా మట్టుబెట్టడమే కాదు ఆర్థికంగా దెబ్బతీయడానికి వ్యవసాయ తోటలను నరికి తమ పైశాచికత్వాన్ని ప్రదర్శించిన తీరు ఇక్కడ మాత్రమే ఉంది. కాలక్రమంలో ఫ్యాక్షన్ వీడి ప్రగతివైపు అడుగులు పడ్డాయి. వందలాది పరిశ్రమలతో వేలాది మందికి ఉపాధినిచ్చే ప్రాంతంగా నిలిచింది. ఇక్కడ ఆధ్యాత్మిక కేంద్రాలకూ కొదవలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ నిర్ణయాలతో వందలాది పరిశ్రమలు మూతపడ్డాయి.


మూతపడ్డ దోలమైట్ పరిశ్రమ

పరిశ్రమల ఖిల్లా


మూతపడ్డ గ్రానైట్ పరిశ్రమ

- ఒకప్పుడు అభివృద్ధికి కేరాఫ్ తాడిపత్రి
- ప్రస్తుతం పరిశ్రమల్లో కరువైన ఉపాధి
- వెంటాడుతున్న తాగునీటి సమస్య
- పదివేల ఎకరాల్లో సాగుకు చుక్కనీరు కరువు

తాడిపత్రి

రాష్ట్రంలోనే తాడిపత్రికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మొట్టమొదటిసారిగా ఫ్యాక్షన్ పురుడుపోసుకున్నది ఈ ప్రాంతంలోనే. దీంతో ఈ ప్రాంతం అంటేనే దేశంలోని పలు రాష్ట్రాల్లో కూడా ప్రత్యేకత ఉంది. కాలక్రమేణా అందరూ చదువుకొని విద్యావంతులు కావడంతో ఫ్యాక్షన్ వీడి ప్రగతివైపు అడుగులు వేయడంతో పెను మార్పులు వచ్చాయి. ఈ ప్రాంతం కూడా అభివృద్ధి వైపు అడుగులు వేసింది. గ్రానైట్, నాపరాళ్లతో పాటు పలు పరిశ్రమల ఏర్పాటుతో అందరికి ఉపాధి లభించింది. చేనేత రంగంమీద ఆధారపడి వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన ఆలయాలు ఉన్నాయి. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం, చింతల వెంకటరమణస్వామి ఆలయం, ఆలూరుకోన రంగనాథస్వామి ఆలయం, కోటకొండ ఆంజనేయస్వామి ఆలయం, యాడికిలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, పెద్దపప్పూరులోని అశ్వత్థ నారాయణస్వామి ఆలయాలు ఉన్నాయి. 30 ఏళ్ల క్రితం పెన్నానది వర్షాకాలంలో బాగా పారేది. నియోజకవర్గం మొత్తం 3,08,414.14 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. నియోజకవర్గ జనాభా 3,65,662గా ఉంది.

ఆ పేరు ఎలా వచ్చిందంటే..

పూర్వం తాడిపత్రిలో ఎక్కడ చూసినా తాటి చెట్లు విపరీతంగా ఉండేవి. అప్పట్లో ప్రజలు తాటి ఆకుల పట్టలతో గుడిసెలు నిర్మించుకొని నివసించే వారని చరిత్ర చెబుతోంది. శ్రీరామచంద్రుడు విశ్వామిత్రుడు యాగం కోసం తాటివనం గుండా (తాడిపత్రి మీదుగా) వెళుతుండగా తాటకి అనే రాక్షసి అడ్డుగా వచ్చింది. దీంతో తాటకిని సంహరించిన ప్రాంతం కావడంతో తాటిపరిధి కాగా రానురాను తాళ్లపరిధిగాను బ్రిటీష్ కాలంలో తాడ్రిపర్తిగా మారి కొన్నేళ్లకు తాడిపత్రిగా పేరు గాంచింది.

తొలి ఎమ్మెల్యే చల్లా



తాడిపత్రి నియోజకవర్గం ఏర్పడిన మొదటి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా చల్లా సుబ్బరాయుడు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి సీపీఐ అభ్యర్థిపై విజయం సాధించారు. చల్లా సుబ్బరాయుడు తాడిపత్రి మండలం చల్లవారిపల్లి గ్రామ నివాసి. ఈయనది వ్యవసాయ కుటుంబం. ఎంతో సౌమ్యుడిగా గుర్తింపు పొందిన ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1955, 1967, 1972లో జరిగిన ఎన్నికల్లో చల్లా విజయం సాధించారు. 1972జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి మంచాల కేశవరెడ్డిపై 7,936 అత్యధిక మెజార్టీ సాధించారు. రెండోసారి 1962లో జరిగిన ఎన్నికల్లో చల్లాపై స్వతంత్ర్య అభ్యర్థి సి. కులశేఖర్‌రెడ్డి విజయం సాధించారు.

బండలే అండ

తాడిపత్రి గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమల బండలే ఇక్కడి ప్రజల ప్రధాన జీవనాధారంగా ఉన్నాయి. వందల సంఖ్యలో పరిశ్రమలు ఉండడంతో ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఉపాధి కోసం వేల సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. తాడిపత్రి సమీపంలోనే నంద్యాల జిల్లాలోని కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లి గ్రామాల సరిహద్దుల్లో నల్లబండల గనులు అత్యధికంగా విస్తరించి ఉన్నాయి. వీటితోపాటు సిమెంట్ పరిశ్రమలైన అల్ట్రాటెక్, పెన్నాపరిశ్రమ, సాగర్‌సిమెంట్స్, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు.


బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం


యాడికి చెన్నకేశవ స్వామి ఆలయం

దర్శనీయ స్థలాలు

విజయనగర రాజుల కాలంలో నిర్మించిన ప్రసిద్ధ శైవక్షేత్రం బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం రెండో కాశీగా విరాజిల్లుతోంది. ఆలయం పక్కనే రుద్రభూమి, గంగానది ఉండడం కేవలం కాశీలో మాత్రమే చూస్తాం. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం పక్కనే రుద్రభూమి, పెన్నానది ఉండడంతో రెండో కాశీగా చెబుతుంటారు. ఆలయంలో స్వామివారి లింగం చుట్టూ కాలంతో సంబంధం లేకుండా ఎప్పటికి నీరు ఉబికి వస్తుండడం ఇక్కడి విశేషం. ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన చింతల వెంకటరమణస్వామి ఆలయం కూడా తాడిపత్రిలో ఉంది. ఇక్కడి వెంకటేశ్వరస్వామిని ఒక్కసారి దర్శించుకుంటే చింతలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మరో వైష్ణవ క్షేత్రంగా ఆలూరు గ్రామ సమీపంలో ప్రకృతి ఒడిలో శ్రీదేవిభూదేవి సమేత ఆలూరు కోన విరాజిల్లుతోంది. పెద్దపప్పూరు సమీపంలో ఉన్న మరో పురాతన ఆలయం అశ్వత్థనారాయణస్వామి చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయం. మాఘమాసంలో జరిగే స్వామివారి తిరుణాల అత్యంత ప్రసిద్ధిగాంచింది. ఈ తిరుణాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు.

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	అధిక్యం
1955	చల్లా సుబ్బరాయుడు	కాంగ్రెస్	వాల్పిరెడ్డి ఆదినారాయణరెడ్డి	సీపీఐ	6331
1962	సి. కులశేఖర్‌రెడ్డి	ఇండిపెండెంట్	చల్లా సుబ్బరాయుడు	కాంగ్రెస్	5667
1967	చల్లా సుబ్బరాయుడు	కాంగ్రెస్	వీకే ఓబిరెడ్డి	ఇండిపెండెంట్	3773
1972	చల్లా సుబ్బరాయుడు	కాంగ్రెస్	మంచాల కేశవరెడ్డి	ఇండిపెండెంట్	7936
1978	దిద్దేకుంట వెంకటరెడ్డి	కాంగ్రెస్	మంచాల కేశవరెడ్డి	జేఎన్‌పీ	5513
1983	ముత్యాల కేశవరెడ్డి	ఇండిపెండెంట్	జేసీ దివాకర్‌రెడ్డి	ఇండిపెండెంట్	11116
1985	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	భూమిరెడ్డి రామచంద్రారెడ్డి	టీడీపీ	11484
1989	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	పేరం నాగిరెడ్డి	టీడీపీ	1219
1994	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	పేరం నాగిరెడ్డి	టీడీపీ	22880
1999	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	పేరం నాగిరెడ్డి	టీడీపీ	4043
2004	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి	టీడీపీ	7877
2009	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	పేరం నాగిరెడ్డి	టీడీపీ	6955
2014	జేసీ ప్రభాకర్‌రెడ్డి	టీడీపీ	వీఆర్ రామిరెడ్డి	వైసీపీ	22172
2019	కేతిరెడ్డి పెద్దారెడ్డి	వైసీపీ	జేసీ అశ్మిత్‌రెడ్డి	టీడీపీ	7511

మూతపడిన పరిశ్రమలు

తాడిపత్రి ప్రాంతంలో పలు పరిశ్రమలు మూతపడ్డాయి. గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు, సిమెంట్ పరిశ్రమలు, కాటన్‌మిల్లుతో తాడిపత్రి ప్రాంతంలో కూలీలకు ఉపాధి కల్పిస్తూ జీవనం సాగించేవారు. ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో కార్మికులు ఉపాధి కోసం వలసవచ్చారు. వీరందరికి సమృద్ధిగా ఉపాధి లభించేది. రానురాను పలు పరిశ్రమలు మూతపడ్డాయి. 1996లో తాడిపత్రి మండలంలోని యర్రగుంటపల్లి వద్ద ఉన్న కాటన్‌మిల్లు మూతపడింది. వాటితోపాటు 80 శాతం మేర గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు పెరిగిన రాయల్టీలు, పన్నుల భారంతో మూతపడ్డాయి. దీంతో వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఒకప్పుడు తాడిపత్రి ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి పట్టణంగా రూపుదిద్దుకుంది. ప్రస్తుత వైసీపీ పాలనలో వీటి నిర్వహణ గాడితప్పింది. తాడిపత్రి పట్టణంలో తాగునీటికి గండికోట నుంచి పైప్‌లైన్ ద్వారా ఆధారపడాల్సిన పరిస్థితి. హెచ్చెల్సీకి నీరు లేకపోవడంతో బీడు భూములుగా మారాయి. పెద్దపప్పూరు మండలం లోని శింగనగుట్టపల్లి, తబ్బుల, ముచ్చుకోట, చెర్లోపల్లి ప్రాంతాలతో పాటు పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు, కొండుపల్లి, భీమునిపల్లి ప్రాంతాల్లో ఖనిజాలకు సంబంధించిన గనులు ఎక్కువగా ఉన్నాయి. యాడికి మండలం భోగాలకట్ట, వెంగన్నపల్లి, రాయలచెరువులో డోలమైట్, స్రీటైట్ ఖనిజ పరిశ్రమలు స్థాపించారు. వీటిపై ఆధారపడి వేలాదిమంది కార్మికులు బతుకుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిబంధనల పేరుతో ఫ్యాక్టరీలను మూయించింది. దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. హెచ్చెల్సీ కాలువకు 25 ఏళ్లుగా నీరు లేకపోవడంతో 10వేల ఎకరాలు బీడు భూములుగా మారాయి. యాడికి కాలువకు నీరు రావాలనేది ఆ మండల వాసుల దశాబ్దాల కల. యాడికి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మండల వాసుల ఏళ్లనాటి కోరిక. పెద్దవడుగూరు మండలంలో కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. యాడికి, పెద్దవడుగూరు మండలకేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటు చేస్తామని అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలుగానే మారాయి.

ధర్మవరం తరువాత యాడికే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేనేత రంగానికి ధర్మవరం తర్వాత యాడికికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ రంగాన్ని నమ్ముకొని 8వేల మంది జీవనం సాగిస్తున్నారు. చేనేతలకు సరైన ప్రోత్సాహం లేక నేతన్నలు నేసిన చీరలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో పరిశ్రమ కుదేలైంది. చేనేత కార్మికులు వృత్తిని వదిలి సమీప పరిశ్రమల్లో కూలీలుగా మారుతున్నారు.

ప్రస్తుత ఓటర్ల సంఖ్య				
మండలం	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
తాడిపత్రి పట్టణం	42392	44438	16	86846
తాడిపత్రి రూరల్	24978	25389	4	50371
పెద్దవడుగూరు	18479	18325	-	36804
యాడికి	23072	23079	4	46155
పెద్దపప్పూరు	14263	13771	2	28036
మొత్తం	123184	125002	26	248212

జేసీ కంచుకోటగా తాడిపత్రి

రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా తాడిపత్రికి ఒక ప్రత్యేకత ఉంటుంది. హేమాహేమీలు బరిలో ఉంటుండడంతో అందరి చూపు తాడిపత్రి వైపు ఉండేది. 1985 నుంచి 2009వరకు ఏకధాటిగా కాంగ్రెస్ తరఫున పోటీచేసిన జేసీ దివాకర్‌రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పలు పర్యాయాలు మంత్రిగా కూడా పనిచేశారు. రాష్ట్రం విడిపోవడంతో జేసీ కుటుంబం టీడీపీలో చేరింది. 2014ఎన్నికల్లో జేసీ దివాకర్‌రెడ్డి సోదరుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి టీడీపీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నియోజకవర్గ చరిత్రలో ఎక్కువసార్లు గెలిచిన రికార్డు జేసీ కుటుంబానికే దక్కుతుంది. 2019ఎన్నికల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డి తనయుడు జేసీ అశ్మిత్‌రెడ్డి టీడీపీ తరపున పోటీచేసి వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి చేతిలో ఓడిపోయారు.


ఎంత ప్రేమో..!

మరణవార్త తెలిస్తే ఇళ్లవద్ద వాలుతున్న నేతలు

ఎన్నికల ప్రచారం ఉధృతంగా జరుగు తోంది. నాయకులు ఇంటింటి ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా తమకు అనుకూలంగా మలుచుకోవాలని యత్నిస్తున్నారు. ఈక్రమంలో పల్లెల్లో ఎవరైనా మరణించారని తెలిస్తే చాలు ఆ పార్టీ ఈ పార్టీ అన్న తేడా లేకుండా నాయకులు, అభ్యర్థులు అక్కడికి వాలిపోతున్నారు. వారి కుటుంబాలను పరామర్శించేందుకు పోటీ పడుతున్నారు. ఎన్నికలు లేనప్పుడు తమ పార్టీ కార్యకర్త మరణించినా అటువైపు వెళ్లని నేతలు కూడా గ్రామాల్లోకానీ, పట్టణాల్లోకానీ మృతిచెందారని విషయం తెలియగానే పూలదండ తీసుకుని మృతదేహం వద్ద ప్రత్యక్షం అవుతు న్నారు. ఒకవేళ తాము అనుకున్న నేత సకాలంలో రాకపోతే వచ్చేవరకు అంత్యక్రియలు జరపకుండా ఆపుతున్నారు. దీంతో వివిధ పార్టీల నాయకులు మృతిచెందిన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు పోటీపడుతున్నారు. మృతిచెందిన వారి ఇంటివద్దకు పదుల సంఖ్యలో బంధువులు, మిత్రులు వచ్చి ఉంటారు. దీనివల్ల ఎంతో కొంత తమకు సానుకూలత ఏర్పడుతుందని క్యాకడుతున్నారు. అంతేకాకుండా అంత్యక్రియలకు సైతం కొంత మొత్తాన్ని మృతుల కుటుంబ సభ్యుల చేతిలో పెడుతున్నారు. ఇలాంటి అభిమానం ఎన్నికలు లేనప్పుడు కూడా చూపితే బాగుంటుందని సామాన్యులు అంటున్నారు.

\- హిందూపురం

వ్యవసాయ రంగం సర్వనాశనం



గోరంట్ల: ప్రభుత్వ విధానాల వలన వ్యవసాయ రంగం సర్వనాశనమైంది. దిన కూలి పెరగడం, పనులు చేసేవారులేక, పంటలు సాగుచేయలేక, బీళ్లు పెడుతున్నాం. ఉచిత కరెంటు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం పది మార్లు విద్యుత్ చార్జీలు పెంచింది. జలకళ పేరుతో ఉచిత బోర్లు వేస్తామని చెప్పి నిధులులేక చేతులెత్తేశారు. వ్యవసాయమోటర్లకు మీటర్లు బిగిస్తున్నారు. ఉపాధి పనులు లేవు. డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి, బస్సు చార్జీలు పెంచారు. రైతు భరోసా ఏడాదికి రూ.6వేలు విడతల వారీగా ఇస్తే ఏమి సరిపోతాయి. టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి రైతుకు రూ.20వేలు ఇస్తామంటోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటున్నారు. ఇన్ని హామీలు ఎలా నేరవేరుస్తారో అర్థం కావడంలేదు. టీడీపీ పాలనలో పొలాలకు సారవంత మైన చెరువు మట్టిని ఉచితంగా తోలేవారు. ఇపుడు ఆ పరిస్థితి ఏమాత్రం లేదు. వైసీపీ హామీలకంటే టీడీపీ హామీలే బాగున్నాయి. రైతుకు మేలు జరగడమే కావలసిందే. లేదంటే తినడానికి తిండిగింజలు పండిచేవారే కరువుతారు.

\- బొక్కసం అంజినప్ప, రైతు, గోరంట్ల

అవినీతి ఎమ్మెల్యేకు బుద్ధి చెబుదాం

● ఎన్నికల ప్రచారంలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

నల్లమాడ, ఏప్రిల్ 30: అవినీతి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ఎన్నికల్లో బుద్ధి చెబుదామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. దొన్నికోట, గూడమేకలపల్లి, సుబ్బరాయునిపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు వెంకటరమణనాయుడు, గంగులప్పనాయుడు, బుట్టి నాగభూషణనాయుడు, రాజశేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● నల్లమాడ మండలం దొన్నికోటకు చెందిన పలువురు వైసీపీ నాయకులు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

● నల్లమాడ మండలంలోని చారుపల్లి పంచాయతీలో టీడీపీ యువనేత పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. చారుపల్లి పంచాయతీ బడవాండ్లపల్లికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, పలువురు నాయకులు పల్లె వెంకట కృష్ణకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : పల్లె సింధూర

పుట్టపర్తి: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని గోకులం, సుబ్బమ్మనగర్, పోస్టాఫీసు వీధి, గణేష్ కూడలిలో మంగళవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. చంద్రన్న అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కూటమి నాయకులు బెస్తచలపతి, కడియాల సుదాకర్, రత్నప్ప చౌదరి, పీసీ గంగన్న, చెన్నకేశవులు, రామలక్ష్మణులు, వెంకటరమణమ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం: మండలంలోని సిద్ధరాంపురం పంచాయతీలోని గ్రామాల్లో పల్లె సింధూర ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. సత్యసాయిబాబా ఆశీస్సులతో ఎలాంటి అవినీతికి తావులేకుండా సేవ చేస్తామన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలతో సైతం ఆమె మాట్లాడుతూ చంద్రన్న సీఎం అయితే మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించవచ్చని తెలిపారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



దొన్నికోటలో ప్రచారంలో పాల్గొన్న పల్లె రఘునాథరెడ్డి



గోకులంలో ప్రచారం నిర్వహిస్తున్న పల్లె సింధూరారెడ్డి

ఎన్నికలను పకడ్బందీగా జరపాలి

పుట్టపర్తి, ఏప్రిల్ 30: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా జరపాలని ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, రామచంద్ర తివారి సూచించారు. జిల్లాకేంద్రంలో మంగళవారం వారు డీఆర్వో కొండయ్యతో కలిసి ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్షచేశారు. జిల్లా యంత్రాంగం ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది కేటాయింపు, శిక్షణా కార్యక్రమాలు, భద్రతాచర్యలు, వెబ్‌కాస్టింగ్, కౌంటింగ్‌కేంద్రాల్లో వసతి సౌకర్యాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్‌పోస్టుల పనితీరు, సమస్యాత్మక గ్రామాలపై సమీక్షించారు. పోలింగ్‌కేంద్రాల్లో ఇప్పటికే అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు డీఆర్వో పేర్కొన్నారు. సమావేశంలో అబ్జర్వర్ల నోడల్ అధికారి వెంకటనారాయణ, లైజనింగ్ అధికారులు వైవీసుబ్బారావు, చంద్రశేఖర్‌రెడ్డి, నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి 25 కుటుంబాలు చేరిక



టీడీపీలోకి చేరిన వారితో పరిటాలశ్రీరామ్

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 30: మండలంలోని మల్లాకాల్వ గ్రామానికి చెందిన 25కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ధర్మవరం పట్టణంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నా రు. వారికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో రామ్మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాగిరెడ్డి, అశోక్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌ని, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారికి సూచించారు. పార్టీ కోసం కష్టపడితే భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు.

4 నుంచి బాస్కెట్‌బాల్‌పై ఉచిత శిక్షణ

ధర్మవరం, ఏప్రిల్ 30: పట్టణంలోని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ ట్రస్టు సౌజన్యంతో ఈ నెల 4 వ తేదీన స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో బాస్కెట్‌బాల్‌పై ఉచితంగా వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అసోసియేషన్ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శెట్టిపి జయచంద్రారెడి, అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఉదయం 6 నుంచి 8గంటల వరకు, తిరిగి సాయంత్రం 4:30 నుంచి 6:30గంటల వరకు ఉంటుందన్నారు. అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9030944717, 9391700032లను సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి క్రికెట్‌పై ఉచిత శిక్షణ

కదిరిఅర్బన్, ఏప్రిల్ 30: ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్‌పై ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు కోచ్ నజీర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మే 2నుంచి నెలరోజులపాటు ఈశిక్షణా శిబిరం కొనసాగిస్తామన్నారు. ఆసక్తి ఉన్న బాలబాలికలు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 8 నుంచి 16 ఏళ్ల లోపు బాల బాలికలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9490806339కు సంప్రదించాలన్నారు.

రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, ఏప్రిల్ 30: ఖాజీపేట్-కొండపల్లి సెక్షన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా ఓ ఎక్స్‌ప్రెస్ రైలు అప్ అండ్ డౌన్ సర్వీసులను దారిమళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెంగళూరు సిటీ-దానాపూర్ (06509) రైలును మే 6, 13, 20 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలును(06510) మే 1, 8, 15, 22 తేదీల్లోనూ దారిమళ్లించి పంపుతామని తెలిపారు. ఈ రైళ్లను ఇటార్సి, ఖాండ్వా, మన్మాడ్, డౌండ్, వాడీ, గుంతకల్లు, ధర్మవరం, యలహంక, బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్ల మీదుగా మళ్లిస్తామని తెలిపారు.

ఎస్కేయూ డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదలచేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30: మొత్తానికి ఎస్కే యూ డిగ్రీ ఫలితాలు విడుదల య్యాయి. డిసెంబరు, జనవరిలో పరీక్ష రాసిన డిగ్రీ మొదటి, మూ డో, ఐదో సెమిస్టర్ విద్యార్థులు.. ఫలితాల కోసం నెలల తరబడి ఎదురుచూశారు. కళాశాలల యాజమాన్యాలు వర్సిటీ అధికారులను బతిమాలి.. చాలించుకున్నాయి. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ అధ్యక్షతన వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య మంగళవారం ఫలితాలను విడుదలచేశారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ రెగ్యులర్ విద్యార్థులు 27,976 మంది పరీక్షలు రాయగా, 16,559 మంది పాసయ్యారని తెలిపారు. మొత్తంగా 59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సప్లిమెంటరీ పరీక్షలను 19,593 మంది విద్యార్థులు 41,222 సబ్జెక్టులను రాయగా.. 22,483 సబ్జెక్టులు ఉత్తీర్ణులయ్యారని వీసీ తెలిపారు. 54 శాతం ఉత్తీర్ణత నమోదైందని అన్నారు. ఫలితాలను బుధవారం జ్ఞానభూమి పోర్టల్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం ఒక పేపర్‌కు రూ.500 చొప్పున ఈ నెల 15లోపు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ డాక్టర్ శ్రీరాములు నాయక్, ఏఆర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రజలే బుద్ధి చెప్తారు: సత్యకుమార్



బ్రహ్మదేవరపల్లిలో దివ్యాంగుడిని పలకరిస్తున్న సత్యకుమార్

ముదిగుబ్బ, ఏప్రిల్ 30: రాష్ట్రంలో ఐదేళ్ల పాటు అరాచక పాలన సాగించిన వైసీపీకి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ పేర్కొన్నారు. మండలంలోని చిన్నకోట్ల, రాఘవం పల్లి, ఎర్రగుంటపల్లి, బూదనాంపల్లి, చిత్రవాండ్లపల్లి, కొడవండ్లపల్లి, ఈదులపల్లి, రంగాపురం, గంగిరెడ్డిపల్లి, బ్రహ్మదేవరపల్లి, హుస్సేన్‌పురం, పీసీరేవు, ఉప్పలపాడు, రాళ్లఅనంతపురం, జొన్నలకొత్తపల్లి, గుంజేపల్లి, ముక్తాపురం, నలాయకుంటపల్లి, యాకర్లకుంటపల్లి, నల్లచెర్లోపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని విస్తృతం గా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు కాపు రామచంద్రారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రజల్ని అభ్యర్థించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, అలాగే సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాతో రోడ్లు దెబ్బతిన్నాయి ..

చిత్రావతిలోంచి ఇసుకను భారీ ఎత్తున భారీ వాహనాలతో రవాణా చేస్తుండడంతో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని సత్యకుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఉప్పలపాడులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు అనుమతులు లేకున్నా ఇసుక తోడి నిల్వచేసుకొని బెంగళూరుకు తరలిస్తున్నారని తెలిపారు. టిప్పర్లతో పెద్దసంఖ్యలో తరలిస్తుండడంతో వాటి ధాటికి పలు గ్రామాల రోడ్లు సైతం దెబ్బతిన్నాయని అన్నారు. ఇందుకు కారణమైన వైసీపీ వారికి ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెప్పనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీలోకి పలు కుటుంబాలు చేరిక

మండలంలోని బూదనాంపల్లి, బ్రహ్మదేవరమర్రి, చిన్నకోట్ల గ్రామాలకు చెందిన సుమారు 70 కుటుంబాల వారు వైసీపీని వీడి బీజేపీలోకి చేరారు. ప్రచారంలో ఉన్న సత్యకుమార్ సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి సత్యకుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

సత్యకుమార్‌కుమద్దతుగా బీజేపీ ఎమ్మెల్యే ప్రచారం



దాడితోటలో ప్రచారం చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు

తాడిమర్రి: సత్యకుమార్‌కు మద్దతుగా కర్ణాటక రాష్ట్రం బెంగళూరు రాజరాజేశ్వరినగర్ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు మండలంలోని దాడితోట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం దాడితోటకు చేరుకుని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటేసి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, బీజేపీ మండల ఇన్‌చార్జ్ కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ శ్రేణుల చేరిక

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 30: మండలంలోని రామిరెడ్డిపల్లికి చెందిన వైసీపీ నాయకులు వై గంగారెడ్డి, పీ. ప్రభాకర్‌రెడ్డి, పీ. శ్రీకాంత్‌రెడ్డి తదితరులు మంగళవారం టీడీపీలోకి చేరారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాయంలో మంగళవారం వారు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ రామానాయుడు, నాయకులు సూర్యనారాయణ నాయుడు, షబ్బీర్‌షనాయుడు, సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండలంలోని పోతులకుంట, మరుకుంట్లపల్లి గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు పుట్టపర్తి టీడీపీకార్యాలయంలో మాజీ మంత్రిపల్లె సమక్షంలో టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. వీరికి పల్లె కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలోప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గంగిరెడ్డి,ఈశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం,బైక్‌తో పోలీసులు

తనకల్లు, ఏప్రిల్ 30: కర్ణాటక రాష్ట్రం చాకివేలుకు చెందిన మనోహర్ అక్రమంగా మద్యం తరలిస్తుండగా మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. మండలంలోని పెద్దపల్లి గ్రామం వద్ద మనోహర్ కర్ణాటకకు చెందిన మద్యంను ద్విచక్రవాహనంలో తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అనంతరం అతడి వద్ద నుంచి 576 టెట్రా ప్యా కెట్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలాల్లో స్టార్టర్లు, కేబుళ్ల చోరీ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 30: మండలంలోని వీర ఓబునపల్లి గ్రామంలో పలువురు రైతుల పొలాల్లో గల స్టార్టర్లు, కేబుళ్లను గుర్తు తెలియని దుండగలు సోమవారం రాత్రి చోరీ చేశారు. గ్రామానికి చెందిన బాబు పొలంలో స్టార్టరు, 20మీటర్ల కేబుల్ చోరీ చేశారు. అంతేకాకుండా అక్కడి వ్యవసాయ బోరుకు అమర్చిన క్లాంపులను తొలగించారని బాధిత రైతు ఆవేదన చెందారు. అలాగే మణికుమార్‌కు చెందిన వ్యవసాయ పొలంలో 30 మీటర్ల కేబుల్, స్టార్టరు, శివగంగయ్య పొలంలో 15మీటర్ల కేబులు, రంగయ్య పొలంలో పదిమీటర్ల కేబుల్ చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితులు ఆవేదన చెందారు. చోరీ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇదిలా ఉండగా ఎం. కొత్తపల్లి గ్రామంలో వీ నాగరాజుకు చెందిన వ్యవసాయ పొలం వద్ద పక్క పొలం వారు గట్టుకు అగ్ని పెట్టారు. దీంతో నిప్పురవ్వలు ఎగిరి తమ పొలంలో పడి అగ్నిప్రమాదం జరిగిందని, దీంతో స్టార్టరు, కేబులు, డ్రిప్ కాలిపోయి రూ.15వేలు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

ముమ్మరంగా కందికుంట ఎన్నికల ప్రచారం



నల్లచెరువులో కందికుంటకు గజమాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

నల్లచెరువు, ఏప్రిల్ 30: మండలకేంద్రంలో మంగళవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. ఆయన రాగానే స్థానిక నాయకులు, ప్రజలు 101టెంకాయలు కొట్టి, గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి బసవన్న కాలనీ, అంబేడ్కర్ కాలనీలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి పనుల గురించి తెలిపారు. చంద్రబాబు సీఎం అవగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారని చెప్పారు. ఆ పథకాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు మాబూసాబ్, దాదెం శివారెడ్డి, అబ్దుల్‌ఖాదర్, నాగభూషణం నాయుడు, అశ్వర్థనాయుడు, వెంకటరమణ, వేణుగోపాల్, కిరణ్‌కుమార్‌నాయుడు, రమేష్‌నాయుడు, ఆనంద్, ప్రసాద్, వేమయ్య, లక్ష్మీపతినాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

నల్లచెరువు/ తనకల్లు, ఏప్రిల్ 30: మండలంలోని కె.పూలకుంటకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని కందికుంట వెంకట ప్రసాద్ నివాసంలో మంగళవారం వారు ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో నాగభూషణం, గోపాల్, కిష్టప్ప, వెంకటరమణ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు మాబూసాబ్, దాద్దెం శివారెడ్డి, తిరుపాల్, వెంకట రమణ తదితరులు ఉన్నారు. అలాగే తనకల్లు మండలం కమతంపల్లి గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వారు టీడీపీలోకి చేరారు. కదిరిలోని కందికుంట నివాసంలో వారు ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బీగం శంకర్‌నాయుడు, శ్రీరాములనాయక్, ఉత్తన్ననాయక్, నాగరాజు, సర్పంచ్ కాంతమ్మ, సోముశేఖర్ పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన కమతం పల్లి వాసులతో కందికుంట

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 30: మండలకేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వెనుక వైపు ప్రాంతాలలో మంగళవారం టీడీపీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. కనుక కూటమి విజయానికి కృషి చేయాలన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా పార్థసారధిని గెలిపించాలని కోరారు. మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, నాయకులు బొడ్డు జయన్న, మండోజీ ఆర్ఫీఖాన్, నిజాం, చాంద్‌బాషా, శ్రీనివాసులు, చికెన్ షానూ, సునీల్ కుమార్, సౌదీ నాగరాజు,మస్తానమ్మ, జ్యోతి, అఖిల పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని టి. సదుం పంచాయతీలోని ఎర్రచెరువుపల్లి, నందిగానిపల్లి, అగ్రహారం, బంగారువాండ్లపల్లి, కాటేపల్లి, తమ్మిశెట్టిపల్లి గ్రామాలతో పాటు దుగినేపల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే వాటిని అమలు చేస్తారన్నారు. ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, ఫణీకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోవిందు, క్రిష్టప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాములనాయక్, జనసేన ఎంపీటీ అమర్ కార్తికేయ శ్రీధర్‌రెడ్డి, జియావుల్లా తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురం, ఎస్‌బీఐ, దుర్గానగర్ కాలనీల్లో టీడీపీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. కూటమి బీజేపీ అభ్యర్థిసత్యకుమార్‌యాదవ్‌ను కమలం గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అలాగే సైకిల్ గుర్తుకు ఓటేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని అన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలో ఉంటే రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందని పేర్కొన్నారు.

సమస్యల్లో సంతగేటు కాలనీ

● వీధిలైట్లు కూడా లేని దుస్థితి
● రోడ్ల సౌకర్యమూ నిల్
● ఇబ్బంది పడుతున్న స్థానికులు



వీధిలైట్లుకు నోచుకోని సంతగేటు కాలనీ

తనకల్లు, ఏప్రిల్ 30: మండలకేంద్రానికి కూతవేటుదూరంలో ఉన్న సంతగేటు కాలనీ పలు సమస్యలతో నిండి ఉంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కాలనీ నేటి వరకు వీధి లైట్లకు కూడా నోచుకోలేదు. దాదాపు 20కుటుంబాలు ఎన్నోయేళ్లుగా అక్కడే జీవనం సాగిస్తున్నాయి. అధికారులు వారి వద్దనుంచి క్రమం తప్పకుండా ప్రతినెలా విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారే తప్ప ఆ కాలనీలో విద్యుత్ స్తంభాలు పాతి వీధిలైట్లు ఏర్పాటు చేసిన పాపాన పోలేదు. దీంతో చీకటి పడిందంటే చాలు కాలనీ వీధుల్లో అంధకారం అలముకుంటోంది. కాలనీ చుట్టూ ఉన్న వ్యవసాయ పొలాలు బీళ్లుగా ఉండడంతో ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. వీటిలో నుంచి తరచూ విష సర్పాలు వస్తుంటాయి. దీంతో కాలనీవాసులు రాత్రి సమయంలో వీధుల్లోకి రావాలంటే భయాందోళనలకు గురవుతున్నారు. కాలనీలో రోడ్లు కూడా లేవని, రాళ్లు తేలిన మట్టిరోడ్లే దిక్కని కాలనీవాసులు వాపోతున్నారు. వర్షం వస్తే చిత్తడిగా మారి నడిచేందుకు కూడా వీలు లేని దుస్థితి నెలకొందని చెబుతున్నారు. సమస్యలను పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేపోయిందంటున్నారు. గత ఎన్నికల్లో కాలనీలో రోడ్ల సౌకర్యం కల్పిస్తామని, వీధిలైట్లు వేస్తామని ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఇచ్చిన హామీ నీటి మూటలాగే మిగిలిపోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కంకర వేసి వదిలేశారు..

● గ్రామీణ రోడ్లకు ఏళ్లు గడిచినా తారు వేయని వైనం
● ఇబ్బంది పడుతున్న స్థానిక ప్రజలు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 30: వైసీపీ పాలనలో యేళ్లు గడిచినా నేటికీ మండలంలోని పలు గ్రామాలకు తారురోడ్లు లేకుండా పోయాయి. ముఖ్యంగా వెంకటాపురం పంచాయతీ బండకిందపల్లి, మల్లెం పల్లోలపల్లికి వెళ్లే రోడ్లకు నాలుగేళ్లక్రితం కంకర వేశారు. కానీ నేటికి తారు వేయలేదు. దీంతో ప్రజలు కంకర రాళ్లపైనే ప్రయాణం సాగిస్తున్నారు. రాళ్ల వల్ల ద్విచక్రవాహనాలు అదుపు తప్పి చాలామంది ప్రమాదాలకు గురయ్యారు. కంకర్‌పై ప్రయాణించాలంటే నరకంగా ఉందని, తారు వేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించామని, ఫలితం లేకపోయిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎప్పటికి తమ సమస్య తీరుతుందోనని మధనపడుతున్నారు.




కంకరతో ఉన్న బండకిందపల్లి రోడ్డు

దాడి చేసిన వైసీపీ మూకలపై చర్యలు తీసుకోవాలి

పుట్టపర్తి, ఏప్రిల్ 30: పుంగనూరులో బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్‌పై దాడిచేసిన వైసీపీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని గోకులంలో మంగళవారం యాదవసంఘం నాయకులు రాజశేఖర్, కిరణ్,ఓబులేసు, ప్రభాకర్, గోవిందు రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. మాట్లాడుతూ పుంగనూరులో వైసీపీ మూకలు రాళ్ల కర్రలతో బోడే రామచంద్ర యాదవ్‌పై దాడిచేసి ప్రచార వాహనాలు తగలపెట్టడం దుర్మార్గ మైన చర్య అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కనుసన్నల్లోనే ఈ దాడి జరిగిందన్నారు. ఆయనకు ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి



ప్రణీత్‌కుమార్(ఫైల్)



మృతిచెందిన రామయ్య

ముదిగుబ్బ/బత్తలపల్లి, ఏప్రిల్ 30: శ్రీసత్యసాయి జిల్లాలో వడదెబ్బతో ఒకే రోజు ఇద్దరు మృతి చెందారు. ముదిగుబ్బ మండల కేంద్రంలోని పాతవూరికి చెందిన చంద్రశేఖర్ కుమారుడు ప్రణీత్ కుమార్(24) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. పుణ్యక్షేత్రాల సందర్శనకు ఆదివారం వెళ్లి తిరిగి వచ్చాక వడదెబ్బకు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. కోలుకోలేక సోమవారం రాత్రి మృతిచెందాడు. బత్తలపల్లి మండల పరిధిలోని గంటాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు రామయ్య (69) వడదెబ్బతో సోమవారం రాత్రి మృతి చెందాడు. వేసవి తీవ్రత కారణంగా ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

నేడు పురానికి నారా బ్రాహ్మణి రాక

హిందూపురం, ఏప్రిల్ 30 : ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి, ఆమె సోదరి తేజస్విని హిందూపురానికి రానున్నారు. సాయంత్రం 4 గంటలకు జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో శ్రీశక్తి మహిళా సాధికారత సమావేశం జరగనుంది. నందమూరి వసుంధరాదేవితోపాటు నారా బ్రాహ్మణి, తేజస్విని పాల్గొంటారని టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్ ప్రకటనలో తెలిపారు.

నేడు మడకశిరలో టీడీపీ ప్రచారం

మడకశిరటౌన్, ఏప్రిల్ 30: పట్టణంలో బుధవారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గం సమన్వ యకర్త గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఆయన మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుతో కలిసి పట్టణ వాసులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి పట్టణంలోని శివాపురం, 8వ వార్డు, వాల్మీకి సర్కిల్, మల్లినాయకనపల్లి, చౌటిపల్లి, చీపులేటి, వజ్రపాళ్యం, పాత ఎస్సీ కాలనీ, 9వవార్డు, తలారి వీధి, చాకలికుంట, మారుతీనగర్, మిట్టబండపాళ్యం, గొల్లహట్టి, బేగార్లపల్లి, సదాశివపురం కాలనీల్లో ప్రచార కార్యక్రమాన్ని చేపడుతామని తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి: ఎంపీడీఓ

అగళి, ఏప్రిల్ 30: మండలవ్యాప్తంగా ఉన్న 5404 మంది లబ్ధిదారులకు బుధవారం పింఛన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అందులో 4104 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. మిగతా 1300 మందికి మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటి వద్దే పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ తెలిపారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

మడకశిరటౌన్, ఏప్రిల్ 30: మండల పరిధిలోని తురకవాండ్లపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు యూనిట్ ఇన్‌చార్జి మహబూబ్ బాషా భార్య షాతాజ్ మంగళవారం ఉదయం మడకశిర ప్రభుత్వాస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, నియోజకవర్గ సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి మడకశిర ఆస్పత్రికి వెళ్లారు. షాతాజ్ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం మహబూబ్‌బాషను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మహబూబ్‌బాషకు ఆర్థిక సాయం అందించి, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని అధైర్యపడవద్దని వారు ధైర్యం చెప్పారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

రెండు కార్లు స్వాధీనం, ఒకరి అరెస్టు



పట్టుబడిన మద్యంతో పోలీసులు

గోరంట్ల, ఏప్రిల్ 30: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.2.45లక్షలు విలువైన మద్యాన్ని మండలంలోని జాతీయ రహదారిపై పాలసముద్రం కూడలిలో మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. దానితోపాటు రెండు కార్లు స్వాధీనం చేసుకుని మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పాలసముద్రం కూడలిలో గోరంట్ల పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగుళూరు వైపు నుంచి ఏపీ 02సీహెచ్6347 నంబర్ గల టాటా ఇండిగో కారు, నంబరు ప్లేట్ లేని ఇతియోస్ కారులో మద్యాన్ని గుర్తించారు. మొత్తం 40 బాక్సులలో 3,840 హైవార్డ్స్ విస్కీ, 90 ఎంఎల్ టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించి అనంతపురం నగరంలోని రుద్రం పేటకు చెందిన బోయ మాధవ్‌ను అరెస్టు చేయగా, పామిడి మండలంలోని ఎద్దులపల్లికి చెందిన శేఖర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో చిక్‌బళ్లాపూర్ నందినీ వైన్స్‌కు చెందిన మంజునాథ్, క్యాషియర్ జగదీష్‌ను బాధ్యులుగా చేస్తూ కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్ఐ ధనుంజయరెడ్డి, పోలీస్ ఇబ్బంది పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీ ఆత్మహత్య



మన్సూర్‌బాషా (ఫైల్)

గోరంట్ల, ఏప్రిల్ 30: పట్టణంలోని రామశంకరయ్య కాలనీలో ఉంటున్న తాపీ మేస్త్రీ మన్సూర్ బాషా (30) సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నా డు. గోరంట్లలోని అల్లాబక్ష కుమారుడైన మన్సూర్ బాషా ఇదే గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ కుమార్తె రేష్మాను వివాహం చేసుకున్నాడు. వారికి తొమ్మిళ్ల సాదియా, ఐదేళ్ల నెహరా అనే ఇద్దరు కుమార్తెలున్నారు. తాపీ మేస్త్రీగా పనిచేస్తూ మన్సూర్ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవపడేవాడు. అతడు సోమవారం రాత్రి భార్యతో తీవ్రంగా గొడవపడ్డాడు. దీంతో ఫక్రుద్దీన్ వచ్చి రేష్మాను, ఇద్దరు పిల్లలను పుట్టినింటికి తీసుకెళ్లాడు. దీంతో ఇంట్లోఒంటరిగా ఉన్న మన్సూర్ మన స్థాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. ఆత్మహత్యకు పాల్పడుతున్న విషయాన్ని సెల్ ఫోన్ బ్లూటూత్‌ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. తండ్రి అల్లాబక్ష వచ్చి చూసేసరికే ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతుండడం, అతడి బ్లూ టూత్ మెడలో వెలాడుతూ కనిపించిది. అనంతరం తలుపులు బద్దలు కొట్టి లోనికెళ్లారు. సమాచారం అందు కున్న సీఐ సుబ్బరాయుడు సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేశారు. మద్యానికి బానిసైన మన్సూర్ బాషా గతంలోనూ రెండుమార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు ఏఎస్ఐ ధనుంజయరెడ్డి తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురం ప్రశాంతతకు టీడీపీని ఆదరించండి

ఎన్నికల ప్రచారంలో నందమూరి వసుంధరా దేవి



కరపత్రం అందించి ఓటును అభ్యర్థిస్తున్న నందమూరి వసుంధరాదేవి

హిందూపురం, ఏప్రిల్ 30: నియోజకవర్గం ప్రశాంతంగా ఉండాలంటే తెలుగుదేశం పార్టీకే ఓటేయాలని నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ముక్కడిపేట, నల్లప్ప లేఅవుట్, కట్లనాగరాజప్పవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వసుంధరాదేవి మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గం ప్రశాంతతకు, మంచిపేరుకు మారుపేరన్నారు. ఇలాగే కొనసాగాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి బాలకృష్ణ ఎంతో తపిస్తారన్నారు. సొంత కుటుంబ సభ్యుల మాదిరిగానే నియోజకవర్గ ప్రజలను భావిస్తారన్నారు. తెలుగుదేశం పార్టీ ఉమ్మడి మేనిఫెస్టో ఎంతో మేలు చేకూరేలా ఉందన్నారు. మధ్యతరగతి, పేద ప్రజలకు ఈ మేనిఫెస్టో అండగా నిలుస్తుందన్నారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులు, యువత, ముస్లింలు, అర్చ కులు, నాయీ బ్రాహ్మణులు ఇలా అన్నివర్గాల వారికి మేలు చేస్తుందన్నారు. చంద్రబాబు చెప్పిన మాట నిలబెట్టుకుంటారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమ న్నారు. మీ పిల్లల భవిష్యత్తుకు మూడు పార్టీలు అండగా ఉంటాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మేలు చేకూర్చే వ్యక్తులకు ఓటేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్, రావిళ్లలక్ష్మి, మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్, నాయకులు చంద్రమోహన్, ప్రెస్‌వెంకటేశ్, బాచి, అమర్నాథ్, ఆది, శివ, సుబ్రహ్మణ్యం, సతీష్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు నమస్కరిస్తున్న వసుంధరాదేవి

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు: సవిత



పరిగి మండలంలో సవితను సన్మానిస్తున్న తెలుగు మహిళలు

హిందూపురం/గోరంట్ల, ఏప్రిల్ 30: టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె మంగళవారం మంగళవారం పరిగి మండలంలోని ఊటకూరు, శాసనకోట, పరిగి పంచా యతీల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ కరోన కష్టకాలంలో ఇక్కడి ప్రజలకు అండగా ఉన్నానన్నారు. రాజకీయాల్లోకి వచ్చిందే ఈ నియోజకవర్గ ప్రజలకు సేవచేయడానికని, కార్యకర్తల వెన్నంటే ఉంటానన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కార్లదిగ్గజం కియ పరిశ్రమను తీసుకొచ్చింది టీడీపీ ప్రభుత్వమని దానివల్ల పెనుకొండ రూపురేఖలు మారాయన్నారు. వైసీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మకుండా రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథిని ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే గోరంట్లలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవిత భర్త వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు టీడీపీ స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్, నిమ్మల యువశేఖర్, అశ్వత్థరెడ్డి, కక్కల రఘు, సుధాకర్‌రెడ్డి, రామచంద్ర, విజయ శేఖర్, వెంకటరెడ్డి, రమణారెడ్డి, శీనా తదితరులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గోరంట్ల ప్రచారంలో సవిత భర్త వెంకటేశ్వర్లు తదితరులు

రాష్ట్రంలో రామరాజ్యం రావాలి: ఎంఎస్ రాజు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, ఏప్రిల్ 30: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రాక్షసరాజ్యం నడుస్తోం దని, అది పోయి రామరాజ్యం రావాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం ఎస్ రాజు, హిందూపురం పార్ల మెంటు అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. వారు టీడీపీ నియోజక వర్గ సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామితో కలిసి మంగళవారం అమరాపురం మండలం బసవనపల్లి, ఆలదపల్లి, హేమావతి తదితర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా మ హిళలు, రైతులు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూలవర్షం కురిపిస్తూ, గజమాలలతో గ్రామాల్లో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో రాక్షసరాజ్యాన్ని పారదోలి, నారా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకొని రామరాజ్యం తెచ్చుకొందామని పిలుపునిచ్చారు. సైకో జగన్ ప్రభుత్వం రైతులను నట్టేట్లో ముంచిందని, రాష్ట్రాభి వృద్ధిని గాలికి వదిలేసిందని, మహిళలకు రక్షణ లేదన్నారు. కక్షలు, కార్పణ్యాలతోనే పాలన సాగిస్తు న్నారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక స్థానికంగా వక్కల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత టీడీపీ హయాంలో వక్కరైతులకు రైతుబంధు కింద రూ.2కోట్ల నిధులు అందించి ఆదుకొన్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మడకశిర ఎమ్మెల్యేగా తిప్పేస్వామి ఏఒక్క అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమం చేపట్టలేదని, ప్రతి చిన్న విషయానికి డబ్బుతోనే ముడిపెట్టి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు అని ఎంఎస్‌రాజు, బీకే పార్థసారథికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు ఆర్ జయకుమార్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, తెలుగు మహిళ నాయకురాలు మీనాక్షిరామిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సౌకర్యాలుండాలి

అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

లేపాక్షి, ఏప్రిల్ 30 : సార్వత్రిక ఎన్నికల బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లవద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం మండలపరిధిలోని నాయనపల్లి క్రాస్‌వద్ద ఉన్న డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బ్యాలెట్ బాక్సులను ఉంచే గదులను క్షుణ్ణంగా పరిశీలించి, భద్రత కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయండి

చెక్‌పోస్టు సిబ్బందికి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచన



పీ బ్యాడిగెర చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న ఎస్పీ

అగళి/రొళ్ల/గుడిబండ, ఏప్రిల్ 30 : ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఎలాంటి మద్యం, డబ్బు అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలోని మడకశిర మండలం రంగాపురం, రొళ్ల మండలం కే బ్యాడిగెర, అగళి పీ బ్యాడిగెర, అమరాపురం సరిహద్దులోని చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా మడకశి రలోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. భద్రతా సిబ్బంది స్ట్రాంగ్ రూమ్ వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం సమస్యాత్మక గ్రామా లైన హరేసముద్రం, గుండుమల, వైపీహళ్లి, కళ్లుమర్రి, రొళ్ల మండలం లోని రత్నగిరి గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రజ లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. గొడవలకు పాల్పడరాదని, ప్రశాతంగా ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎస్పీ రొళ్ల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి అనంతరం కర్ణాటక సరిహద్దు బ్యాడిగెర చెక్‌పోస్టులో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకొన్నారు. గుడిబండ మండలంలోని జీ మోరుబాగల్, గుడిబండ, ఇటికేపల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాజీజాన్‌సైదు, సీఐలు మనోహర్, రాజ్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెత్తందారులకు కొమ్ముకాసిన ఈరలక్కప్ప

టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్

గుడిబండ, ఏప్రిల్ 30 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులను పెత్తందారులకు మళ్లించేందుకే ఉపాధిహామీ పథకం కూలీగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పనిచేశారని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ ఆరోపించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జాతీయ గ్రామీణాభివృద్ధి ఉపాధిహామీ పథకం ప్రారంభమైనప్పుడు గుడిబండ మండలంలో ఉపాధిహామీ పథకంలో రాష్ట్రస్థాయిలోనే పెద్ద అవినీతి జరిగిందన్నారు. ఇందులో గుడిబండ మండలం ప్రత్యేక గుర్తింపు పొందిందని ఈ విషయంపై సామాజిక తనిఖీ, వార్త పత్రికల్లో కథనాలు వచ్చాయని ఆరోపించారు. ఉపాధిహామీ నిధులను పెత్తందారులకు దారిమళ్లించేందుకే ఈరలక్కప్ప ఉపాధిహామీ కూలీగా బినామీ మస్టర్లు రాసేందుకే పనిచేశారని మండల ప్రజలందరికీ తెలిసిందన్నారు. ఎంఎస్ రాజు నాన్‌లోకల్ అని ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, జిల్లా డైరెక్టర్ కారణ్య రాజశేఖర్ ఆరోపించడం తగదన్నారు. హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, పెనుకొండ అసెంబ్లీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఏ రాష్ట్రానికి చెందినవారో తెలుసుకోవాలని సూచించారు. ఎంఎస్ రాజు ఉమ్మడి అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అని అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారన్నారు. ఎంఎస్ రాజుపై 60కేసులున్నాయని విమర్శించడం తగదన్నారు. ప్రజల సమస్యల పోరాటానికి ఎంఎస్ రాజు అండగా ఉన్నారని గుర్తుచేశారు.

తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరు వృథా

- పట్టించుకోని అధికారులు, నాయకులు
- ఇబ్బందులు పడుతున్న మిట్ట ప్రాంతం వాసులు



మహదేవపల్లిలో పైప్‌లైన్ పగిలి నీరు లీకేజీ అవుతున్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 30: అసలే ఎండలు మండిపోతున్నాయి. పెనుకొండ నగర పంచాయతీలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో పైప్‌లైన్ పగిలి రెండు నెలలు కావస్తున్నా 17వ వార్డు వైసీపీ కౌన్సిలర్ రామాంజి అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. తాగునీటి పైప్‌లైన్ అరికట్టాల్సిన మునిసిపల్ అధికారులు మౌనంగా ఉండటంతో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. పెనుకొండ నగర పంచాయతీ 17వ వార్డు మహదేవపల్లిలో తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరంతా వృథా అవుతోంది. నగర పంచాయతీ పరిధిలోని షీప్‌ఫారం వద్ద బోర్లువేసి సంపులు ఏర్పాటుచేసి అక్కడి నుంచి పట్టణానికి పైప్‌లైన్ ద్వారా నీటిని అందిస్తున్నారు. షీప్‌ఫారం నుంచి మహదేవపల్లి, రాజేశ్వర కాలనీకి పైప్‌లైన్ ద్వారా నీటిని అందిస్తున్నారు. ఈ క్రమంలో నగర పంచాయతీలోని మహదేవపల్లిలో రెండు నెలల కిందట ప్రధాన పైప్‌లైన్ పగిలి నీరంతా వృథా అవుతోంది. పైప్‌లైన్ మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కౌన్సిలర్ రామాంజిని వేడుకున్నా ఆయన పట్టించుకున్న పాపానపోలేదని కాలనీ వాసులు అంటున్నారు. తాగునీటి పైప్‌లైన్ పగలిపోవడంతో ఎత్తు ప్రాంతంలో ఉన్న నివాసాలకు తాగునీరు అందక నానా అవస్థలు పడుతున్నామన్నారు. ఒక్కోసారి పగిలిన పైప్‌లైన్ వద్ద కొళాయి పైప్ ఏర్పాటు చేసి, దానిద్వారా బిందెలో పట్టుకుని నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగిలిన పైప్‌లైన్ పక్కనే పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటితొట్టి ఉందన్నారు. తొట్టి కాస్త ఛిద్రమైందన్నారు. నీటి తొట్టికు మరమ్మతులు చేస్తే ఎండాకాలంలో పశువులు నీరుతాగేందుకు అనువుగా ఉంటుందని కౌన్సిలర్‌ను వేడుకున్నా ఆయన పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్‌గా రామాంజి ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క అభి వృద్ధి పని కూడా చేపట్టలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఛిద్రమైన పశువుల తొట్టె

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

రొద్దం, ఏప్రిల్ 30: టీడీపీ అధికారంలోకి వస్తే 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 నెలకు అందిస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. మండల పరిధిలోని బూచర్ల, రాగిమేకలపల్లిల్లో మంగళవారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవితకు ఓటేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవీపీ నాయుడు, మాధవనాయుడు, సుబ్బరత్నమ్మ, చంద్రమౌళి, చిన్నప్పయ్య, నరసింహులు, నరహరి, క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, రాగిమేకలపల్లి హనుమంతరెడ్డి, హరీష్, ఎల్‌ఐసీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండలపరిధిలోని దొడ్డేరి గ్రామంలో మంగళవారం టీడీపీ స్థానిక నాయకుడు దాసిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, మండల తెలుగు యువత అధ్యక్షులు బాలకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి యంజారప్ప, మురళీ, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ స్థానిక దళిత నాయకులు మండలంలోని దొడ్డేరి, బీజీ హళ్లి, మల్లినమడుగు తదితర గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. ప్రచార కార్యక్రమం నిర్వహించారు. దళిత నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జ్ నరేష్(కన్నా), గోపాల్, వైస్ ఎంపీపీ హరీష్, ఎస్సీ సెల్ కృష్ణమూర్తి, నారాయణప్ప, రామాంజనే యులు, సురేష్, ఎస్సీ సెల్ మూర్తి పాల్గొన్నారు.

ఎస్కేయూ డిగ్రీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30: మొత్తానికి ఎస్కేయూ డిగ్రీ ఫలితాలు విడుదలయ్యాయి. డిసెంబరు, జనవరిలో పరీక్ష రాసిన డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ విద్యార్థులు.. ఫలితాల కోసం నెలల తరబడి ఎదురుచూశారు. కళాశాలల యాజమాన్యాలు వర్సిటీ అధికారులను బతిమాలి.. చాలించుకున్నాయి. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ అధ్యక్షతన వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య మంగళవారం ఫలితాలను విడుదలచేశారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ రెగ్యులర్ విద్యార్థులు 27,976 మంది పరీక్షలు రాయగా, 16,559 మంది పాసయ్యారని తెలిపారు. మొత్తంగా 59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సప్లిమెంటరీ పరీక్షలను 19,593 మంది విద్యార్థులు 41,222 సబ్జెక్టులను రాయగా.. 22,483 సబ్జెక్టులు ఉత్తీర్ణులయ్యారని వీసీ తెలిపారు. 54 శాతం ఉత్తీర్ణత నమోదైందని అన్నారు. ఫలితాలను బుధవారం జ్ఞానభూమి పోర్టల్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం ఒక పేపర్‌కు రూ.500 చొప్పున ఈ నెల 15లోపు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ డాక్టర్ శ్రీరాములు నాయక్, ఏఆర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల దారిమళ్లింపు

గుంతకల్లు, ఏప్రిల్ 30: ఖాజీపేట్-కొండపల్లి సెక్షన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా ఓ ఎక్స్‌ప్రెస్ రైలు అప్ అండ్ డౌన్ సర్వీసులను దారిమళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెంగళూరు సిటీ-దానాపూర్ (06509) రైలును మే 6, 13, 20 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలును(06510) మే 1, 8, 15, 22 తేదీల్లోనూ దారిమళ్లించి పంపుతామని తెలిపారు. ఈ రైళ్లను ఇటార్సి, ఖాండ్వా, మన్మాడ్, డౌండ్, వాడీ, గుంతకల్లు, ధర్మవరం, యలహంక, బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్ల మీదుగా మళ్లిస్తామని తెలిపారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు



గతుకులు పడిన కోనాపురం రహదారి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 30 : పెనుకొండ నగర పంచాయతీలో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. పెనుకొండ నగర పంచాయతీ అయినప్పటి నుంచి కోనాపురం, మంగాపురం, ఇస్లాపురం, వెంకటరెడ్డిపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదు. పెనుకొండ నుంచి నారాయణమ్మ కాలనీ, కోనాపురం వెళ్లే రహదారి చాలా అధ్వానంగా తయారైంది. పెనుకొండకు రాకపోకలు సాగించేందుకు ఆ ప్రాంతాల వాసులు నానా అవస్థలు పడుతున్నారు. రహదారిలో గోతులు ఏర్పడటంతో వాహనాల్లో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుం దన్నారు. పెనుకొండ నుంచి కోనాపురం వరకు రోడ్డు మంజూరయిందని వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు చెబుతూనే ఉన్నారు. కానీ ఆ రోడ్డు వేసిన పాపానపోలేదని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులు పడిన రోడ్లకు ఆరు నెలల కిందట మట్టితోలి మమ అనిపించారు. అయితే శాశ్వత పరిష్కారం చూపలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల స్టార్టర్లు, కేబుల్ చోరీ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 30: మండలంలోని వీర ఓబున పల్లిలో పలువురు రైతుల స్టార్టర్లు, కేబులును గుర్తు తెలియని దుండగలు చోరీ చేశారు. గ్రామానికి చెందిన బాబు పొలంలో స్టార్టరు, 20 మీటర్ల కేబుల్ చోరీ చేయడమేకాకుండా వ్యవసాయ బోరుకు అమర్చిన క్లాంపులను తొలగించారని రైతు ఆవేదన చెందాడు. అలాగే మణికుమార్ వ్యవసాయ పొలంలో 30మీటర్ల కేబుల్, స్టార్టరు, శివగంగయ్య పొలంలో 15 మీటర్ల కేబులు, రంగయ్య పొలంలో పదిమీటర్ల కేబుల్‌ను సోమవారం రాత్రి చోరీ చేసినట్లు వారు ఆవేదన చెందారు. చోరీ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.